




నదీతీరాలను రక్షిత, నియంత్రిత, హెచ్చరిక మూడుజోన్లుగా కేంద్ర ప్రభుత్వం విభజించింది. ప్రవహించే నదుల నుంచి 100 మీటర్ల వరకు 'నో డెవలప్‌మెంట్ జోన్'గా ప్రకటించింది. నదులకు వచ్చే వరద తీవ్రతను బట్టి 500 మీటర్ల దూరం వరకు నిషేధాజ్ఞలు అమలవుతాయి. అందుకు అనుగుణంగా కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ 'ఫ్లడ్ ప్లెయిన్ జోనింగ్' పేరిట వరద ప్రవాహ ప్రాంతాల్లో సాంకేతిక మార్గదర్శకాలు జారీ చేసింది. వరద తీవ్రత నదుల్లో తుంగభద్ర, హంద్రీ కూడా ఉన్నాయని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. నగరం నడిబొడ్డున ప్రవహిస్తున్న హంద్రీ తీరంలో సెంటు స్థలం రూ.లక్షల్లో పలుకుతుంది. అక్రమార్కులకు కన్నేసి ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేస్తున్నారు. ఆక్రమణలు తొలగించడంలో జలవనరులు , రెవెన్యూ, నగరపాలక శాఖల నిర్లక్ష్యం శాపంగా మారింది. 2007, 2009 లాంటి వరదలొస్తే ప్రజలకు రక్షణ ఏదీ..? కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతోనైనా హంద్రీ నది ఆక్రమణలకు అడ్డుకట్ట పడేనా..? ఆ వివరాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

నగరం మధ్యలో హంద్రీ నది



# ఆక్రమణలు ఆగేనా..?

- హంద్రీ కబ్జాలు తొలిగేనా?
- మూడు జోన్లుగా నదీతీరాలు
- రక్షిత, నియంత్రిక, హెచ్చరిక జోన్లుగా గుర్తింపు
- నదులకు 100 మీటర్ల వరకు 'నో డెవలప్‌మెంట్ జోన్'
- మార్గదర్శకాలు జారీ చేసిన కేంద్రం

**కర్నూలు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు నగరం మధ్యలో 5.40 కిలోమీటర్లు హంద్రీ నది ప్రవహిస్తుంది. నదీతీరం ఇరువైపులా ఆక్రమణలకు గురైంది. గరిష్ఠ వరద ప్రవాహ అంచుల (మ్యాగ్జిమమ్ ఫ్లడ్ లెవల్-ఎంఎఫ్ఎల్) నుంచి 50 మీటర్లు (150 అడు గులు) వరకు బఫర్ జోన్‌గా, వక్కెరు వాగు తీరం వెడల్పు (బఫర్ జోన్) 30-50 అడుగుల వరకు ఉంటుందని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. స్థిరాస్తుల విలువ భారీగా పెరగడంతో హంద్రీ, వక్కెరు వాగు సహా నగరం అంచున ప్రవహించే తుంగభద్ర మునగాల పాడు నుంచి జోహరాపురం వరకు నదీతీరాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. రాజకీయ నాయకుల అండదండలతో దర్జాగా కబ్జా చేస్తున్నారు. గత వైసీపీ హయాంలో నిబంధనలు తుంగలో తొక్కేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్లు వెంచర్లు వేయడం, ఇళ్ల నిర్మాణాలు చేసి విక్రయాలు సాగిస్తున్నారు. జేసీ బి.నవ్య ఆదేశాల మేరకు రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి హంద్రీ నది కుడిగట్టు వెంబడి 164, ఎడమ గట్టు వెంబడి 174 ఆక్రమణలు గుర్తించారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు హంద్రీ సరిహద్దులు గుర్తించి.. సరిహద్దు సిమెంట్ పిల్లర్లు పాతారే తప్పా ఆక్రమణల జోలికి వెళ్లలేదు. దీంతో కొత్తగా భవనాలు నిర్మించిన బడా రియల్ ఎస్టేట్ వ్యాపారులు యథేచ్ఛగా స్థిరాస్తి వ్యాపారాలు చేస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి.



హంద్రీ నది సరిహద్దులు గుర్తించి పిల్లర్లు ఏర్పాటు చేస్తున్న అధికారులు (ఫైల్)

మిగతా 7వ పేజీలో

### మళ్లీ వరదొస్తే..

హంద్రీ నదికి 1997లో ఆగస్టు, సెప్టెంబరులో రెండుసార్లు లక్ష క్యూసెక్కులకు పైగా వరదొచ్చి నదీతీరంలో కాలనీలు ముంపునకు గురయ్యాయి. 2007లో ఏకంగా 2లక్షల క్యూసెక్కులు వరద రావడంతో కల్లూరు దగ్గర ఉన్న హైవే నుంచి జొహరాపురం వరకు విఠల్ నగర్ సహా వివిధ కాలనీలు ముంపునకు గురై ఊహించని నష్టం చవిచూశారు. 2009లో ఏకంగా 3లక్షల క్యూసెక్కులకు పైగా వరద రావడంతో నదీతీరం అంచులపై ఏకంగా ఆరేడు అడుగుల ఎత్తులో వరద ప్రహించిందని ఇంజనీర్లు గుర్తు చేస్తున్నారు. పగటి పూట వరద రావడంతో ఆస్తి నష్టం తప్పా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, అదే రాత్రి వరదొచ్చి ఉంటే ఊహించుకోవడానికి భయమేస్తుందని నాడు వరద సహాయక చర్యల్లో పాల్గొన్న ఇంజనీరు ఒకరు పేర్కొన్నారు.

### రక్షణ గోడ నిర్మాణం కోసం..

హంద్రీ నదీతీరం జోహరాపురం నుంచి పందిపాడు వరకు, తుంగభద్ర తీరం కుడిగుట్టు జోహరాపురం నుంచి మునగాలపాడు సమీపంలోని హైవే వరకు, వక్కెరు వాగు ఆనంద్ సినీ థియేటర్ నుంచి రేడియోస్టేషన్ వరకు, సుద్దవాగు సి.క్యాంప్ సర్కిల్ నుంచి జోహరాపురం వరకు రక్షణ గోడ నిర్మాణం కోసం రూ.220 కోట్లు నిధులు కేటాయించి టెండర్లు పిలిచారు. పనులు చేయకపోవడంతో ఆ టెండర్లు రద్దుచేశారు. ఐదారు రోజులుగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తుంది. అదే జరిగితే ప్రతి వర్షపు చుక్క వంకలు, వాగుల ద్వారా హంద్రీ నదికి చేరే అవకాశం లేకపోలేదు. మళ్లీ వరదొస్తే? నదీతీర కాలనీలకు రక్షణ ఏదీ? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.



కర్నూలు నడిబొడ్డున విఠల్‌నగర్ వద్ద ప్రవహిస్తున్న హంద్రీనదిని ఆక్రమించుకుని బఫర్ జోన్‌లో నిర్మించిన అక్రమ నిర్మాణాలు

## ప్రభుత్వ క్వార్టర్స్‌ను ఖాళీ చేయండి

### అనధికార వ్యక్తులకు జిల్లా యంత్రాంగం ఆదేశాలు

**కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** నగరంలోని ఏబీసీ క్యాంపుల్లో ఉన్న ప్రభుత్వ క్వార్టర్స్‌లో అక్రమంగా నివసిస్తున్న వారు వచ్చే నెల 7వ తేదీ లోపు ఖాళీ చేయాలని జిల్లా యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఏబీసీ క్యాంపుల్లో ఉన్న ప్రభుత్వ క్వార్టర్స్‌లో ఆటోల ద్వారా ప్రచారం నిర్వహించారు. ఖాళీ చేయని పక్షంలో రెవెన్యూ, ఆర్ అండ్‌బీ, మున్సిపల్, విద్యుత్, పోలీసు శాఖల అధికారులతో కూడిన బృందం ద్వారా ఖాళీ చేయించనున్నట్లు జిల్లా యంత్రాంగం హెచ్చరించింది.

## పంచాయతీరాజ్ ఎస్ఈగా వేణుగోపాల్

**కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ఐ.వేణుగోపాల్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పని చేస్తున్న 15 మందికి ఎస్ఈలుగా పదోన్నతి కల్పించారు. ఈ క్రమంలోనే ఖాళీగా ఉన్న కర్నూలు ఎస్ఈ పోస్టులో ప్రకాశం జిల్లా ఈఈగా విధులు నిర్వహిస్తున్న వేణుగోపాల్‌ను నియమించారు. కర్నూలులో ఈఈగా పని చేసున్న ఎస్‌సీఈ మద్దన్నను కడప ఎస్ఈగా, నంద్యాల ఈఈ ఎం. రామ్మోహన్‌ను సీఆర్‌డీఏ ఎస్ఈగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ముగిసిన బార్ల గడువు

- నేడు లాటరీ పద్ధతిలో ఎంపిక



చివరి రోజు బార్ లైసెన్స్‌ల కోసం బారులు తీరిన యాజమాన్యాలు

**కర్నూలు అర్బన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** బార్ లైసెన్స్ దరఖాస్తులకు గడువు ముగిసింది. శుక్రవారం సాయంత్రం ఎక్సైజ్ కార్యాలయంలో బార్ల యాజమాన్యాలు చివరి నిమిషంలో లైసెన్సులు పొందేందుకు హడావుడి చేశారు. జిల్లాలో 23 బార్లు, 3 గీత కులాలకు కలిపి మొత్తం 26బార్లకు సంబంధించి ఈనెల 18న నోటిఫికేషన్ జారీచేశారు. దరఖాస్తులకు ఈనెల 26కు గడువు ముగిసినప్పటికీ స్పందన లేకపోవడంతో 29వ తేదీ వరకు గడువు పొడిగించారు. కర్నూలు నగరంలోని 16 బార్లకు 11 దరఖాస్తులు రాగా, ఆదోనిలో 4, గీత కులాలకు కర్నూలు-2, ఆదోని-1 చొప్పున బార్ల లైసెన్స్‌లకు దరఖాస్తులు వేశారు. ఈ బార్లకు సంబంధించి శనివారం జడ్పీ సమావేశ మందిరంలో కలెక్టర్ రంజిత్‌బాషా లాటరీ పద్ధతిన లైసెన్సులను ఎంపిక చేసే ప్రక్రియకు ఎక్సైజ్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

## నేడు కప్పట్రాళ్లకు ఆకె రవికృష్ణ రాక

**దేవనకొండ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** ఈగల్ విభాగాధిపతి (ఐజీ) ఆకె రవికృష్ణ శనివారం కప్పట్రాళ్లకు రానున్నారు. ఇటీవలే విడుదలైన డీఎస్సీలో ఫలితాల్లో కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన ఏడుగురు యువకులు ప్రతిభ చాటారు. దత్తత పుత్రుడు రవికృష్ణ కప్పట్రాళ్లకు చేస్తున్న సేవలను 'కత్తులు వదిలి.. కలం హలం' అనే శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. రాష్ట్రవ్యాప్తంగా కప్పట్రాళ్ల గ్రామం పేరు మార్మోగింది. దీంతో రవికృష్ణ కప్పట్రాళ్లకు చేరుకొని డీఎస్సీ అభ్యర్థులను సన్మానించనున్నట్లు ఆ గ్రామస్థులు తెలిపారు.

## ఉల్లి రైతులకు అండగా ఉంటాం

### కలెక్టర్ రంజిత్ బాషా



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

**కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** ఉల్లి రైతులకు అండగా ఉంటామని కలెక్టర్ రంజిత్ బాషా హామీ ఇచ్చారు. శుక్రవారం ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్యతో కలిసి కలెక్టర్ కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో పర్యటించారు. ఉల్లి విక్రయాలపై రైతులతో మాట్లాడి అనంతరం మార్కెట్ కమిటీ, మార్కెటింగ్, ఉద్యాన శాఖ అధికారులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులు అమ్మకానికి తెచ్చిన ఉల్లి నాణ్యత పరిశీలించారు. కర్నూలు మార్కెట్ యార్డుపై ఒత్తిడి తగ్గించేందుకు కోడుమూరులో ఉల్లి విక్రయాలు జరిగేలా చర్యలు చేపట్టాలని యార్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని జేడీని ఆదేశించారు. సి.బెళగల్, కోడుమూరు, గూడూరు తదితర మండలాల్లోని రైతులకు దూరం తగ్గి ఖర్చులు తగ్గుతాయని కలెక్టర్ తెలిపారు. ఆదోని మార్కెట్ యార్డులో పనులు నెమ్మదిగా సాగడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కర్నూలు మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ అజ్మత్‌బీ, వైస్ ఛైర్మన్ శేషగిరిశెట్టి, మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, ఏడీఎం నారాయణమూర్తి, ఆర్డీవో సందీప్ కుమార్, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్ వైజర్లు కేశవరెడ్డి, నాగేష్, శివన్న పాల్గొన్నారు.

## 464 లక్షల లీటర్ల పాలు సేకరిస్తాం

- విజయ డెయిరీ ఎండీ ప్రదీప్‌కుమార్



మాట్లాడుతున్న విజయ డెయిరీ ఎండీ ప్రదీప్ కుమార్

**కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** విజయ డెయిరీలో 2026-27 సంవత్సరానికి 464 లక్షల లీటర్ల పాల సేకరణే లక్ష్యమని ఆ సంస్థ ఎండీ ప్రదీప్ కుమార్ అన్నారు. శుక్రవారం కర్నూలు జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సమితి 38వ వార్షిక సర్వసభ్య సమావేశం కర్నూలు విజయ డెయిరీ ప్రాంగణంలో ఛైర్మన్ ఎస్వీ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని విజయ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సమితి రోజురోజుకు అభివృద్ధి చెందుతోందని అన్నారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అనేక పథకాలు, కార్యక్రమాలను ఛైర్మన్ ఎస్వీ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్నాయన్నారు. నెయ్యి తయారీ 630 టన్నులకు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. గత సంవత్సరం వార్షిక టర్నోవర్ రూ.319కోట్లు కాగా, ఈ ఏడాది రూ.393కోట్ల టర్నోవర్ సాధించాలని నిర్ణయించుకున్నామని, అందులో భాగంగా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. ఐదేళ్లుగా ప్రతి ఏటా పాడి రైతులకు క్రమం తప్పకుండా బోనస్‌ను చెల్లిస్తున్నామన్నారు. రైతులు సంస్థ అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగించుకొని సంస్థ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయన కోరారు.

## శ్రీశైలంలో 9 గేట్ల ద్వారా నీటి విడుదల

- నీటి నిల్వ సామర్థ్యం 197 టీఎంసీలు



శ్రీశైలం డ్యాంలో 9 గేట్ల ద్వారా విడుదల అవుతున్న నీరు

**శ్రీశైలం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** శ్రీశైలం రిజర్వాయర్‌కు వరద వచ్చి చేరుతుండంతో 9 క్రస్టు గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,38,626 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ పరివాహక ప్రాంతమైన జూరాల స్పిల్‌వే నుంచి 1,23,768 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి అనంతరం 33,403 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 20,196 క్యూసెక్కులు మొత్తం 1,77,367 క్యూసెక్కులు వరద వచ్చి చేరుతోంది. శుక్రవారం సాయంత్రం డ్యామ్ నీటిమట్టం 851.60 అడుగులు ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 197 టీఎంసీలుగా నమోదైంది. శ్రీశైలంలో కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి అనంతరం 30,522 క్యూసెక్కులు, 30,315 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.

## ఘనంగా 'గిడుగు' జయంతి



గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డీఆర్వో వెంకట నారాయణమ్మ

**కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** తెలుగు భాష అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఆర్వో వెంకట నారాయణమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి డీఆర్వో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ గిడుగు రామమూర్తి వ్యవహారిక తెలుగుకు నాంది పలికిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురికి ప్రొఫెసర్లుగా పదోన్నతులు

**కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల, కర్నూలు మెడికల్ కాలేజీలో ఆప్తమాలజి విభాగంలో పని చేస్తున్న ముగ్గురు అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పిస్తూ వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన కంటి వైద్యుల్లో పీఆర్ నివేదిత (కర్నూలు మెడికల్ కాలేజీ నుంచి జీఎంసీ నంద్యాల), పి.పెంచలయ్య (కర్నూలు కేఎంసీ నుంచి జీఎంసీ కడప), జీ.ఎస్. కస్తూరిబాయి (జీఎంసీ నంద్యాల నుంచి జీఎంసీ అనంతపురం) ఖాళీ స్థానాల్లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు నియమించారు.

కోలాహలంగా గణేశ్ ఉత్సవాలు

6లో




ఎమ్మిగనూరులో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు

ఇక వెళ్లొస్తా..



ఆత్మకూరులో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు

పూరి గణనాథుడు




కర్నూలు వన్‌టౌన్‌లో..

విద్యా వినాయక



ఆదోని: అవ్వ బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడు

గురుడ గణపయ్య




త్రిముఖ.. త్రిశూలధారుడై



కర్నూలు పూలబజార్‌లో కొలువైన వినాయకులు

వీణాపాణిగా..



ఆదోని కొత్త బస్టాండ్‌కి వెళ్లే రహదారిలోని మండగిరి యూత్ ఏర్పాటు చేసిన వీణ వాయిస్తూ కొలువుదీరిన గణపయ్య

# కోలాహలంగా గణేశ్ ఉత్సవాలు

### పలు ప్రాంతాల్లో నిమజ్జనం

**కర్నూలు కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** గణేశ్ ఉత్సవాలు ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం పలు ప్రాంతాల్లో నిమజ్జన వేడుకలు జరిగాయి. ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆత్మకూరు, కోడుమూరు పట్టణాలతో పాటు అన్ని మండలాల్లో వినాయక నిమజ్జనం పూర్త యింది. ప్రధాన పట్టణాల్లో ఐదు రోజులకు నిమజ్జనం జరగనుంది. ఎమ్మిగనూరులో 350కి పైగా విగ్రహాలను ఎల్లెల్సీలో నిమజ్జనం చేశారు. యువత కేరింతలు, డీజే సౌండ్ నడుమ పట్టణంలో భారీ ర్యాలీ జరిగింది. ఇదిలా ఉండగా నంద్యాల, కర్నూలు, డోన్ తదితర ప్రాంతాల్లో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. వెరైటీ వినాయకులు ఆకట్టుకుంటున్నాయి. కర్నూలు మించిన్‌బజార్‌లో విఘ్ననాయకుడు ఇస్కాన్ గణపతి రూపంలో దర్శనమిస్తుండగా, కుమ్మరి వీధిలో కృష్ణ భగవానుడిని భుజంపై ఎత్తుకొనే విగ్రహం ఆకట్టుకుంటోంది. కుమ్మరి వీధిలో శంఖచక్రాలను ధరించిన గణపతి, కాళికాంబ గుడి వద్ద ఆదిశేషుని దాల్చిన గణపతి, బండిమెట్టలో సూర్య భగవానుడిని వెనుక దాల్చిన గణపతి, అక్కడే నుదిట అమ్మవారిని ధరించిన గణపతి మూర్తులు ఆకర్షణీయంగా నిలుస్తున్నాయి. పూలబజార్‌లో గరుడ మూర్తిని చేతదాల్సిన వినాయకుడు, అదేప్రాంతంలో త్రిముఖ గణనాథుడు, చిన్న అమ్మవారిశాల వద్ద బసవ రథంపై గణనాథుడు, బొంగుల బజార్‌లో వీణాగణపతి మూర్తులు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.



కర్నూలు పెద్ద అమ్మవారిశాల వద్ద..



ఆదోని బుడ్డేకల్‌లో పూజలందుకుంటున్న ఏకదంతుడు



కర్నూలు మించిన్ బజార్‌లో



ఆదోని: రాజరాజేశ్వరి నగర్‌లో పర్యావరణ పరిరక్షణకై వెలిసిన లంబోదరుడు

## ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

● జిల్లా ఒలింపిక్ సంఘం సీఈవో విజయకుమార్



ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఒలింపిక్ సంఘం సభ్యులు, క్రీడా ప్రతినిధులు

**కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** హాకీ మాంత్రికుడు.. మేజర్ ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని చక్కటి ప్రతిభ కనబరిచి క్రీడల్లో రాణించాలని కర్నూలు జిల్లా ఒలింపిక్ సంఘం సీఈవో పి.విజయ కుమార్ పిలుపునిచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో ధ్యాన్‌చంద్ విగ్రహానికి సీఈవోతో పాటు డీఎస్‌డీవో భూపతిరావు, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, సభ్యులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ హాకీలో రాణించి దేశానికి పేరు తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి పి.సునీల్ కుమార్, సహాయ కార్యదర్శి డాక్టర్ రుద్రారెడ్డి, సభ్యులు అవినాశ్ శెట్టి, శివ, సతీష్, శ్రీనివాసులు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## కళాస్రవంతి ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం



తెలుగు కళాస్రవంతి ఆధ్వర్యంలో సత్కారం పొందిన ఐదుగురు సాహితీవేత్తలు

**కర్నూలు కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** తెలుగు కళాస్రవంతి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి తెలుగు భాషా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తెలుగు సాహిత్యంలో రాణిస్తున్న ఐదుగురు కవులకు గిడుగు రామమూర్తి స్మారక తెలుగు భాషా పురస్కారాలను అందజేశారు. రచయిత ఎస్‌డీవీ అజీజ్, కవులు నాగమణి, మారుతీ పౌరోహితం, తెలుగు వెంకటేశ్, కెంగార మోహన్‌లకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గాడిచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ కల్కూర, విశిష్ట అతిథిగా విచ్చేసిన తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థ కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ మాట్లాడుతూ తెలుగు భాష రెండు వేల సంవత్సరాలకు పైగా ఉన్న చరిత్రగల భాష అని గుర్తు చేశారు. భాషను దూరం చేసుకుంటూ మన సంస్కృతి, సంప్రదాయ మూలాలను దూరం చేసుకున్నట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు కళాస్రవంతి అధ్యక్ష, కార్యదర్శిలు ఎంఎండీ ఇనాయతుల్లా, ఎస్.మహమ్మద్ మియాలు మాట్లాడుతూ తెలుగు భాషాభిమానులు, రచయితులు, కవులు కళాకారులు ఒక్కరోజుతో తెలుగు భాషా దినోత్సవాన్ని సరిపెట్టకుండా ఏడాది పొడవునా భాషకు సంబంధించిన అనేక కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆలపించిన తెలుగు గేయాలు, గజల్స్ అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కేజీ గంగాధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ కార్యాలయంలో...



నివాళి అర్పిస్తున్న అధికారులు, ఉద్యోగులు

**కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** నగరంలోని జిల్లా పరిషత్ పరిపాలన భవనంలో తెలుగు వ్యవహారిక భాష ఉద్యమకర్త గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలు గు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. శుక్రవారం జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బారెడ్డి హాజరై గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ మధురమైన భాష తెలుగు అని, తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారులు మురళీమోహ న్‌రెడ్డి, బసవశేఖర్, పుల్లయ్య, సి.రాంగోపాల్, బాబుభాస్కర్, ఉద్యోగులు కల్యాణి, పుష్ప, వాణి, వాజిదా తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు భాషపై ప్రవాసాంధ్రుల ఆదరణ అభినందనీయం

### టీజీవీ కళాక్షేత్రంలో ప్రారంభమైన తెలుగు భాషా దినోత్సవాలు



రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య, కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్యతో సత్కారం పొందిన సాహితీవేత్తలు

**కర్నూలు కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** తెలుగు భాష పట్ల తెలుగు రాష్ట్రాల్లో ఆదరణ తగ్గుతుంటే, తెలుగు వారు నివసించే ప్రపంచ దేశాల్లోని ప్రవాస ఆంధ్రుల్లో పెల్లుబికుతున్న భాషాభిమానం అభినందనీయమని రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య అన్నారు. శుక్రవారం గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన తెలుగు భాషా దినోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం జరిగిన విద్యార్థుల ప్రతిభా పోటీలకు వందలాదిగా విద్యార్థులు హాజరయ్యారు. తెలుగు భాష ఆవశ్యకతను తెలియజేసేలా తమ అభిప్రాయాలను వ్యాసరూపాల్లో అందజేశారు. సాయంత్రం నిర్వహించిన కవి సమ్మేళనం కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన కవులు, రచయితలు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య, కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, సాహితీవేత్తలు తొలుత తెలుగుతల్లి, గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటాలకు పూలదండలు వేసి తెలుగు గీతాలను ఆలపించారు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా, టీజీవీ కళాక్షేత్రం మూడు రోజుల పాటూ తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు. కళాక్షేత్రం చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ సలహా, సూచనల మేరకు మూడు రోజుల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు దండెబోయిన పార్వతీదేవి, దేవేంద్రప్ప, స్వరూప్ సిన్హా, గద్వాల ఈరన్న, శ్రీనివాసరెడ్డి, సునీత రాణి, రాణి లీలావతి, హసీనాబీ, పుణ్యవతి, పార్వతయ్య, వెంకటేశ్వర్లు, చక్రపాణి, ధరిత్రిదేవి, బాలస్వామి, బలరామయ్య, హరిశ్చంద్రారెడ్డి, ఎం.హరికిషన్ తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి సి.యాగంటీశ్వరప్ప, సభ్యులు శ్రీనివాసరెడ్డి, గాండ్ల లక్ష్మన్న, పి.రాజరత్నం, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



### నేడు 'రికార్డు' స్థాయిలో పౌరాణిక ప్రదర్శన

టీజీవీ కళాక్షేత్రంలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఏకపాత్రాభినయ పోటీలను రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ ప్రారంభిస్తారని కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. ఈ పోటీలకు హాజరయ్యే కళాకారులకు సత్కారం, ప్రశంసాపత్రంతో పాటు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తామని తెలిపారు. 24 గంటల పాటు జరిగే ఈ ప్రదర్శనలను తెలుగుబుక్ ఆఫ్ రికార్డులో నమోదు కానుంది.



టీజీవీ కళాక్షేత్రంలో తెలుగు భాషపై నిర్వహించిన పోటీలకు హాజరైన విద్యార్థులు

# అమ్మ భాషను కాపాడుకుందాం

### మాజీ ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్

**కర్నూలు కల్చరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** అమ్మవంటి తెలుగు భాషను కాపాడుకుందామని కర్నూలు మాజీ ఎంపీ డాక్టర్ సం జీవ్‌కుమార్ అన్నారు. శుక్రవారం గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నగరంలోని నవ్యాంధ్రప్రదేశ్ విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో, తెలుగు భాషా దినోత్సవ సదస్సును ఘనంగా నిర్వహించారు. జడ్పీ కార్యాలయం ఆవరణలోని ఎంపీపీ సమావేశ హాలులో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎంపీతో పాటూ విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బా రెడ్డి, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు కేసీ కల్కూర, తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థ రాష్ట్ర కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి జి. నాగముని, బాలల సాహిత్యవేత్త డాక్టర్ ఎం. హరికిషన్, బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్, న్యాయవాది డాక్టర్ ఆర్ ప్రవీణ్‌కుమార్, ఏపీఎస్పీ డీఎస్పీ ఎస్. మహబూబ్ బాషా హాజరయ్యారు. రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలపూల వేసి నివాళులర్పించారు. నవ్యాంధ్రప్రదేశ్ విద్యార్థి సమాఖ్య అధ్యక్షుడు మల్లెపోగు రాజన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమలో మాజీ ఎంపీ మాట్లాడారు. బాలసాహిత్యంలో విశేష కృషిచేస్తున్న డాక్టర్ ఎం.హరికిషన్‌ను సత్కరించారు. ప్రముఖ రచయిత ఎస్ ముర్తుజా, కవయిత్రి రాణి లీలావతికి పురస్కారాలు ప్రదానం చేశారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

**కర్నూలు కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు యూసీపీఎల్ఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ ఎన్ రామచంద్రన్, యూసీపీఎల్ఆర్ఎఫ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. యునైటెడ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అండ్ లీగల్ రైట్స్ ఫౌండేషన్ (యూసీపీఎల్ఆర్ఎఫ్) ఆధ్వర్యంలో అందజేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల పాఠశాలల ఉపాధ్యాయులు, కళాశాలల అధ్యాపకులు తాము చేపట్టిన పాఠశాలలు, విద్యాభివృద్ధికి చేపట్టిన ప్రత్యేక అంశాలు, సామాజిక చైతన్య కార్యక్రమాలు, అక్షరాస్యత పెంపుదల, సమాజ పురోభివృద్ధికి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడ, సేవా, సహకార రంగంలో కృషి, విద్యార్థులకు మార్కుల పెరుగుదలకు చేపట్టిన ప్రయోగాత్మక అంశాలు, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాల పెంపుదలకు చేసిన కార్యక్రమాలు వంటివి పూర్తి వివరాలతో పంపించాలన్నారు. దరఖాస్తులను సెప్టెంబరు 1వ తేదీలాగా పంపించాలని, ఎంపికైన ఉపాధ్యాయులను సెప్టెంబరు 7న ఉదయం 10 గంటలకు కర్నూలులోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ సమావేశ మందిరంలో సత్కరించి, ప్రశంసాపత్రాలు అందజేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని ఏ జిల్లాకు చెందిన వారైనా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వారు తెలిపారు.

## సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలి

● సెట్కూరు సీఈవో వేణుగోపాల్



మాట్లాడుతున్న సెట్కూరు సీఈవో వేణుగోపాల్

**ఓర్వకల్లు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** సైబర్ మోసాలతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సెట్కూరు సీఈవో కె.వేణుగోపాల్ సూచించారు. శుక్రవారం ఓర్వకల్లులోని ఆర్‌సీ ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ మోసాల నివారణ, మత్తు పదార్థాల దుష్పరిణామాల అంశాలపై జిల్లా యువజన సంక్షేమ శాఖ, సెట్కూరు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సెట్కూరు సీఈవోతో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి రాజశేఖర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. ప్రపంచం నిరంతరం కొత్త టెక్నాలజీతో అభివృద్ధి చెందుతూ డిజిటల్ టెక్నాలజీతో పని చేసే స్మార్ట్ ఫోన్లు, కంప్యూటర్లు, ఇంటర్నెట్, సోషల్ మీడియా మన దైనందిక కార్యక్రమాల్లో భాగమయ్యాయని చెప్పారు. బ్యాంకు అధికారులమంటూ చెప్పి ఓటీపీ చెప్పించుకొని ఖాతాల్లోని నగదును మాయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గురువయ్యశెట్టి, అధ్యాపకులు, సెట్కూరు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలుగుభాష పరిరక్షణ మన కర్తవ్యం



నివాళి అర్పిస్తున్న వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు, కవులు, రచయితలు, సాహితీప్రియులు

**నంద్యాల కల్చరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** తెలుగు భాషను పరిరక్షించుకోవడం మన కర్తవ్యం అని నంది రైతు సమాఖ్య ముఖ్య సలహాదారు డాక్టర్ రవీంద్రనాథ్ అన్నారు. మాతృభాషా పరిరక్షణ సమితి, నంది రైతు సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలోని భారతి సీడ్స్ కార్యాలయంలో శుక్రవారం 'తెలుగుభాషా పరిరక్షణ-మన కర్తవ్యం' అనే అంశంపై చర్చ నిర్వహించారు. తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేశారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. వక్తలు మాట్లాడుతూ అన్ని భాషలను ప్రేమించాలని, అయితే అమ్మభాషను మరువకూడదని ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాల స్థాయి తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని, భాషాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. మనజీవన వ్యవహారాలన్నీ స్వభాషతో ముడిపడి ఉంటాయన్నారు. తెలుగుభాషలోని జాతీయాలు, చమత్కారాలు, శతక పద్యాలు, సామెతలు, పొడుపు కథలు, ఈ తరం పిల్లలు నేర్చుకునేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. శ్రీనివాసమూర్తి, డాక్టర్ కిషోర్‌కుమార్, శేషఫణి, కవులు, కొప్పుల ప్రసాద్, రచయతలు, సాహితీ సంస్థల ప్రతినిధులు, నంది రైతు సమాఖ్య ప్రతినిధులు తూము శివారెడ్డి పాల్గొన్నారు.

## మాతృ భాష మధురమైనది

● నంది అవార్డు గ్రహీత గజల్ మహ్మద్ మియా



మాట్లాడుతున్న గజల్ మహ్మద్ మియా

**నందికొట్కూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** మాతృ భాష మధురమైనది అని నంది అవార్డు, రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డుల గ్రహీత గజల్ మహ్మద్ మియా అన్నారు. నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవంతో పాటు, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గజల్ మహ్మద్ మియా మాట్లాడుతూ తెలుగు భాషలోని తీయనం ఒక చక్కటి సంగీతంలా కనిపిస్తోందన్నారు. ఎన్నో తెలుగు పాటలను గజల్ పాడారు. కళాశాల ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ భాషాభివృద్ధి దేశాభివృద్ధి అని, భాష మానవ జీవిత మనుగడకు ఒక చక్కటి ఉదాహరణ అని అన్నారు. కార్యక్రమంలో రఘుపతి రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

# మగిసిన డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,525 మందికి కాల్ లెటర్లు



శ్రీనివాస బీఈడీ కళాశాలలోని డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

**కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారం ముగిసింది. మొదటి రోజు సాంకేతిక కారణాలతో కొన్ని అవాంతరాలు ఎదురైనా వాటన్నింటినీ అధిగమిస్తూ ఎట్టకేలకు జిల్లా విద్యాశాఖ అధికారులు సర్టిఫికెట్ల పరిశీలనను పూర్తి చేశారు. అయితే సర్టిఫికెట్ల పరిశీలన మాత్రమేనని, ఈ అభ్యర్థుల ఎంపిక తుది జాబితా కాదని విద్యాశాఖ అధికారులు చెబుతుండటంతో అభ్యర్థుల గుండెల్లో మరో టెన్షన్ మొదలైంది. మొదటి రోజున 2,307 మంది అభ్యర్థులకు కాల్ లెటర్స్ జారీ అయ్యాయి. అలాగే రెండో రోజున 218 మందికి కాల్ లెటర్లు జారీ అయ్యాయి. మొత్తం 2,525 మంది అభ్యర్థులకు గానూ 24 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పెండింగ్‌లో ఉంది. వారి సర్టిఫికెట్లను కూడా పరిశీలించి వందశాతం పూర్తి చేసి వివరాలను పంపుతామని డీఈవో శ్యామూల్‌పాల్ చెప్పారు.

### సాంకేతిక సమస్యలు లేకుండా చూడాలి

మెగా డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు లేకుండా చూడాలని కలెక్టర్ రంజిత్ బాషా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. నగర సమీపంలోని శ్రీనివాస బీఈడీ కళాశాల కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ సందర్శించి వెరిఫికేషన్ పరిశీలన బృందాలతో మాట్లాడారు. కాల్ లెటర్స్ పరిశీలనకు సంబంధించి ఎప్పటికప్పుడు వ్యక్తిగత లాగిన్‌లో సమాచారాన్ని అప్‌లోడు చేస్తున్నట్లు డీఈవో శామ్యూల్‌పాల్ వివరించారు. సర్వర్ సమస్య పునరావృతం కాకుండా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా హైఫై ఇంటర్నెట్‌తో నిర్వహించాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారులకు సూచించారు. అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ ఏడీ వి.ప్రతాప్‌రెడ్డి, అబ్రహాం, కడప ఆర్జేడీ శామ్యూల్, కర్నూలు, నంద్యాల డీఈవోలు శామ్యూల్ పాల్, జనార్దన్‌రెడ్డి, ఉప విద్యాశాఖ అధికారులు, ఏడీలు, మండల విద్యాశాఖ అధికారులు, హెచ్‌ఎంలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# పెద్దాసుపత్రిలో ఆధిపత్య పోరు

- ఇద్దరు అధికారుల మధ్య కోల్డ్ వార్
- నలిగిపోతున్న వైద్య సిబ్బంది
- వాదనకు దారితీసిన బిల్లు విషయం




**కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** పెద్దాసుపత్రిలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లు విషయం ఇద్దరు అధికారుల మధ్య వాదనకు దారితీసింది. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇద్దరు అధికారుల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరింది. పాలన వ్యవహారాలకు సంబంధించిన ఓఅధికారి తనకు అన్ని చెప్పాల్సిందేనని ఒకరు.. నిబంధనల ప్రకారం తాను కీలకమైన అధికారినంటూ మరో అధికారి.. ఇలా ఇద్దరి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.

### వివాదాలకు కేంద్ర బిందువుగా మారారు

పాలన వ్యవహారాలు చూసే ఓఅధికారి, హాస్పిటల్ వ్యవహారాలు చూసే మరో అధికారి. ఇద్దరు వివాదాలకు కేంద్ర బిందువుగా మారారు. కర్నూలు మెడికల్ కాలేజీ పెథాలజీ డిపార్టుమెంట్‌లో సీడీఎస్ నిధుల కింద రూ.లక్షతో పనులు చేపట్టేందుకు కేఎంసీ ప్రిన్సిపాల్ మంజూరు చేశారు. ఈపనులు పూర్తయ్యాక వ్యయం లక్షకు కాస్త ఎక్కువైంది. ఈ విషయం పెథాలజీ హెచ్‌వోడీ, ప్రిన్సిపాల్‌కు ఓఅధికారికి చెప్పడంతో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అదనపు బడ్జెట్ బిల్లుపై అధికారులు కూడా సంతకాలు చేశారు. వారం రోజుల క్రితం ఇద్దరు అధికారులు బిల్లుకు సంబంధించిన విషయంపై కేఎంసీ ప్రిన్సిపాల్‌ను కలవడానికి ఒకే కారులో బయలుదేరారు. అదనపు బడ్జెట్ బిల్లు విషయం తనకు ఎందుకు చెప్పలేదని అధికారి మరో అధికారిని ప్రశ్నించినట్లు తెలిసింది. ఆఫైల్ మీరు కూడా చూశారని, సంతకం కూడా పెట్టారని సమాధానం చెప్పడంతో ఆ అధికారికి చిరెత్తికొచ్చినట్లు సమాచారం. ఈ బిల్లు ప్రిన్సిపాల్ ఆమోదం తెలిపారని చెప్పడంతో తనకు చెప్పకుండా ఎలా సంతకం పెట్టించారంటూ వాదనకు దిగారు. దీంతో ఆఅధికారి కూడా తానేమీ అటెండర్‌ను కాదని, గెజిటెడ్ ఆఫీసర్‌ను అని, ఫైల్‌ను మీ దగ్గరకు పంపించామని, మీకు ఆ ఫైల్‌పై అభ్యంతరాలు ఉంటే డిస్కస్ అని రాయాలని ఘాటుగా సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో రగిలిపోయిన అధికారి మరో అధికారిని కారులో ఎక్కించుకోకుండా హాస్పిటల్‌కు బయలుదేరినట్లు సమాచారం. ఇలా ఇద్దరు అధికారుల మధ్య పోరు జీజీహెచ్‌లో రావణ కాష్టంగా తయారైంది.

### విదేశీ పర్యటన అంశంపైనే..

జీజీహెచ్‌లోని ఓ అధికారి నాలుగు నెలల క్రితం ఎలాంటి అనుమతి లేకుండా విదేశీ పర్యటనకు వెళ్లింది. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఆఫీసర్ విదేశీ పర్యటనకు వెళ్లాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ఆ అధికారి ప్రభుత్వ అనుమతుల్లేకుండా విదేశీ పర్యటనకు వెళ్లి రావడంతో మరో అధికారికి ఆయుధం చిక్కినట్ల అయ్యింది. ఈవిషయాన్ని పదే పదే ప్రశ్నించినట్లు తెలిసింది.

### ప్రభుత్వ వాహనాన్ని సొంత అవసరాలకు..

ఆసుపత్రిలో ఓఅధికారికి ప్రభుత్వం అద్దె వాహనాన్ని సమకూర్చి ప్రతి నెల రూ.45వేలు బిల్లు చెల్లిస్తుంది. వాస్తవానికి ఈఅద్దె వాహనం కర్నూలు లేదా ఆఫీసు పని ఉంటే మన రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లవచ్చు. సదరు అధికారి అధికారిక విధులకు వాడాల్సిన వాహనాన్ని స్వంత అవసరాలకు వినియోగిస్తున్నట్లు విమర్శలున్నాయి. ఈఅద్దె వాహనానికి సంబంధించిన బిల్లును పెండింగ్‌లో పెట్టడంతో ఇద్దరు అధికారుల మధ్య వివాదం మొదలైంది. ఈబిల్లు పెట్టడంలో కొంత జాప్యం చేయడంతో అధికారి ససేమిరా అనడంతో అప్పటి నుంచి ఇద్దరు అధికారుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. వారిద్దరి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో ఆసుపత్రి ఉద్యోగులు, వైద్యులు నలిగిపోతున్నారు. వైద్య విద్య ఉన్నతాధికారులు కలెక్టర్ జోక్యం చేసుకుని ఇద్దరి అధికారుల మధ్య కోల్డ్‌వార్‌ను నివారించాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.

### ఎలాంటి గొడవలు లేవు



కర్నూలు సర్వజన వైద్యశాలలో ఇద్దరు అధికారుల మధ్య జరుగుతున్న కోల్డ్‌వార్‌పై సూపరింటెండెంట్ డాక్టర్ కే.వెంకటేశ్వర్లును 'ఆంధ్రజ్యోతి' కోరగా ఎలాంటి గొడవలు లేవన్నారు. పాలనాపరంగా చిన్నచిన్న విషయాలు ఉంటాయని, ఈ విషయాన్ని ఆయన కొట్టి పారేశారు.

- డాక్టర్ కే.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

**కోవెలకుంట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** కోవెలకుంట్ల - ఆళ్లగడ్డ వెళ్లే ప్రధాన రహదారిలో భీమునిపాడు ఎస్సీ కాలనీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాలివీ.. దొర్నిపాడు మండలం క్రిష్టిపాడుకు చెందిన గడ్డం వీరేంద్ర (30) అనే యువకుడు బైకుపై కోవెలకుంట్లకు వస్తుండగా కోవెలకుంట్ల నుంచి ఆళ్లగడ్డ వెళుతున్న వాహనం భీమునిపాడు గ్రామం ఎస్సీకాలనీ వద్దకు వచ్చేసరికి ఎదురుగా ఢీకొట్టింది. దీంతో వీరేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. వీరేంద్ర పట్టణంలోని ఓ షాపులో టైలరుగా పనిచేస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

## వ్యక్తి ఆత్మహత్య

**మంత్రాలయం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** మంత్రాలయంలోని ఒక ప్రైవేటు అతిథి గృహంలో పనిచేస్తున్న కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ పట్టణానికి చెందిన రవి (47)అనే వ్యక్తి లాడ్జి బాత్‌రూమ్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపిన వివరాలివీ.. రవి రెండురోజుల క్రితం లాడ్జీలో క్లీనింగ్ చేయడానికి కూలీగా చేరారు. శుక్రవారం తెల్లవారుజామున లాడ్జి బాత్‌రూమ్‌లో గడిపెట్టుకొని పంచాతో ఉరివేసుకున్నారు. ఆయనతో పాటు పనిచేసే వారు యజమానులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఘటనా స్థలానికి చేరేకొని బాత్‌రూమ్ డోర్‌ను తెరిచి మృతదేహాన్ని కిందికి దించి పరిశీలించారు. మృతదేహాని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడి అడ్రస్ తెలియకపోవడంతో శివమొగ్గ పోలీసులకు సమాచారం ఇచ్చారు. లాడ్జి యజమాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## అదుపుతప్పి జీపు బోల్తా

**పాణ్యం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** ఓ జీపు వెనుక టైరు ఊడిపోవడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటన శుక్రవారం మండలంలోని బలపనూరు సమీపంలో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. కర్నూలు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న జీపు వెనుక చక్రం ఊడిపోవడంతో జీపు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పక్కనున్న రోడ్డుపై బోల్తా పడింది. జీపులో 12మంది ప్రయాణికులు ఉన్నారు. గాయపడ్డ ప్రయాణికులను చికిత్స నిమిత్తం శాంతిరాం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## వ్యక్తి అదృశ్యం

**పత్తికొండ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** మండలానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యం కాగా కేసు నమోదు చేసినట్లు సీఐ జయన్న తెలిపారు. వివరాలు.. మండలంలోని చక్రాల గ్రామానికి చెందిన పద్మనాభరెడ్డికి క్రిష్ణగిరి మండలంలో కంబాలపాడుకు చెందిన శిరీషతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. అతడు బండలాగుడు ఎద్దుల పోటీల్లో పాల్గొనేందుకు తరుచూ వెళ్లేవాడు. అలా వెళ్లిన ప్రతిసారి నెలా, రెండు నెలలు వరకు ఇంటికి రాడని, ఫోన్ కూడా ఇంటి వద్దే ఉంచి వెళ్తాడని భార్య ఫిర్యాదులో పేర్కొంది. మూడు నెలలైనా భర్త నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో శుక్రవారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. మూడు నెలల క్రితం గ్రామంలో పద్మనాభరెడ్డికి, మరోవ్యక్తికి ఘర్షణ చోటుచేసుకుందని ఆరోజు నుంచే అతడు కనిపించడం లేదని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్లు ప్రారంభం

**డోన్ రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** డోన్‌లో కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక నూతన భవనంలో అడ్మిషన్ల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు 1 నుంచి 5వ తరగతి వరకు ప్రవేశానికి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. డోన్‌లో కేంద్రీయ విద్యాలయానికి సొంత భవనం ప్రస్తుతం లేకపోవడంతో ఐటీఐ కళాశాల నూతన కాంప్లెక్స్‌లో ఉన్న భవనాన్ని కేంద్రీయ విద్యాలయానికి వినియోగించనున్నారు. శుక్రవారం ప్రారంభమైన అడ్మిషన్ల ప్రవేశానికి సంబంధించి దరఖాస్తులకు విద్యార్థుల తల్లిదండ్రులు ఎగబడ్డారు.

## 'బాల భారతి'కి బాసట...

- వరుసగా ఆరో ఏడాది రూ.10 లక్షల విరాళం
- కర్నూలు ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ వితరణ
- ఇష్టంగా చదివి ఉన్నతంగా ఎదగాలి : డీఐజీ ప్రవీణ్




చెక్కును అందజేస్తున్న కోయ ప్రవీణ్, పొట్లూరి రవి

**ఓర్వకల్లు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** ఓర్వకల్లు మండల పొదుపులక్ష్మి ఐక్య సంఘం ఆధ్వర్యంలోని బాలభారతి పాఠశాల పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం తానా డైరెక్టర్, కర్నూలు ఎన్నారై ఫౌండేషన్ ఛైర్మన్ పొట్లూరి రవి వరుసగా ఆరో ఏడాది రూ.10 లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం పాఠశాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆ విరాళం చెక్కును, పాఠశాల వ్యవస్థాపకురాలు విజయభారతికి అందజేశారు. ముందుగా పాఠశాల్లో ఏర్పాటుచేసిన వినాయకుడికి, వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. పేద విద్యార్థులకు చేయూతనిస్తూ కర్నూలు ఎన్నారై ఫౌండేషన్ ఛైర్మన్ పొట్లూరి రవి పేద విద్యార్థులకు ఆరేళ్లుగా ఏటా ఆర్థిక సహాయం అందించడం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. ఎన్నారైలు సామాజిక, సేవా కార్యక్రమాల్లో తమవంతు పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. స్కౌట్స్ అండ్ గైడ్‌లో రాజ్య పురస్కారానికి అర్హత సాధించి, గవర్నర్‌తో ప్రశంసాపత్రం అందుకున్న ఈ పాఠశాల విద్యార్థిని గీతను అభినందిస్తూ ఆయన రూ.5వేలు బహుమతి అందజేశారు. అనంతరం డీఐజీ కోయ ప్రవీణ్‌తో పాటు పొట్లూరి రవిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్ ముప్పా రాజశేఖర్, కర్నూలు డీఎస్పీ బాబూ ప్రసాద్, రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఎస్ఐ సునీల్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ నవ్య, పొదుపులక్ష్మి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### ఆటంకాలు లేకుండా చదువుకోవాలనే: పొట్లూరి రవి



సమావేశంలో మాట్లాడుతున్న పొట్లూరి రవి

అనాథ విద్యార్థుల ఎలాంటి ఆటంకాలు లేకుండా చదువుకోవాలనే ఉద్దేశంతో విరాళాన్ని అందిస్తున్నట్లు పొట్లూరి రవి అన్నారు. ప్రతి సంవత్సరం రూ.10లక్షల చొప్పున పాఠశాల యజమాన్యానికి ఐదేళ్లుగా విరాళాన్ని అందిస్తున్నామన్నారు. లాభాపేక్ష లేకుండా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిస్తున్న బాలభారతి పాఠశాలకు భవిష్యత్తులో కూడా తమ వంతు సహకారం అందజేస్తామని పలువురు ఎన్‌ఆర్‌ఐలు ఈ కార్యక్రమానికి తోడ్పాటు అందిస్తున్నారని, వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. పొదుపు సంఘం మహిళలు శ్రమశక్తితో నిర్మించుకున్న బాలభారతి పాఠశాల మహిళా శక్తికి నిదర్శనమని పొదుపు మహిళలను అభినందించారు. ఎన్‌ఆర్‌ఐలు సామాజిక సేవా కార్యక్రమాల్లో తమ వంతు పాత్ర పోషించడంతో వారిని విజయభారతి అభినందించారు.

## కూతురిని విదేశానికి పంపి.. తండ్రి అనంతలోకాలకు



విజయ్‌కుమార్ (ఫైల్)



అదుపుతప్పి రోడ్డుపక్కకు వెళ్లిన ప్రమాదానికి గురైన కారు

**ఎర్రవల్లి/ ఎమ్మిగనూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** కన్న కూతురిని విదేశానికి సాగనంపేందుకు వెళ్లిన తండ్రి తిరుగు ప్రయాణంలో అనంతలోకాలకు వెళ్లిన హృదయవిదారక సంఘటన చోటుచేసుకున్నది. జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని ధర్మవరం స్టేజీ దగ్గర 44వ జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకున్నది. ఈఘటనలో మరో ఇద్దరికి గాయాలయ్యాయి. కొదండాపురం ఎస్ఐ మురళి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీలోని కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకి చెందిన విజయ్‌కుమార్(60), మాధవి దంపతులు కలిసి తమ కుమార్తె నందినిని లండన్‌కు పంపేందుకు గురువారం రాత్రి ఎమ్మిగనూర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు కారులో వెళ్లారు. కూతురిని విమానాశ్రయంలో డ్రాప్ చేసి శుక్రవారం తెల్లవారుజామున తిరుగు ప్రయాణమయ్యారు. జాతీయ రహదారిపై గల ధర్మవరం స్టేజి దగ్గర డ్రైవర్ అజాగ్రత్తతో ముందు వెళుతున్న కంటైనర్ లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో కారు రోడ్డు పక్కకు అదుపు పడిపోయింది. విజయ్‌కుమార్ తలకు గాయాలు కాగా ఆయన భార్య మాధవి, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించగా అప్పటికే విజయ్‌కుమార్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గాయాలపాలైన ఇద్దరు చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనపై మృతుడి కుమారుడు చిలుకూరు నయాన్‌కాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## కొలిక్కిరాని గ్రేడింగ్ సమస్య

- నేడు క్రయవిక్రయాలు నిలుపుదల

**ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) :** వేరుశనగ రైతులను తీవ్రంగా నష్టం చేకూరుస్తున్న గ్రేడింగ్ సమస్య కొలిక్కి రాలేదు. శనివారం ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో వేరుశనగ దిగుబడులకు క్రయవిక్రయాలు జరగవని మార్కెట్ యార్డ్ సహాయ కార్యదర్శి శాంతకుమార్ తెలిపారు. రైతులు తాము పండించిన వేరుశనగ దిగుబడులను మార్కెట్ కమిటీకి తీసుకురావద్దని కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాసింగ్ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నా మన్నారు. మార్కెటింగ్ చట్టంను ఉల్లంఘించి వ్యాపారులు గ్రేడింగ్ చేయడం పై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై జిల్లా ఉన్నత స్థాయి అధికారులు దృష్టి సారించి రైతులకు మేలు చేకూర్చాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## ఉల్లి రైతుల కష్టాలపై స్పందించిన సీఎం

- అమరావతిలో ఉన్నతాధికారులతో సమీక్ష

**కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి జిల్లాలో ఉల్లి రైతుల కష్టాలపై 'ఆంధ్రజ్యోతి'లో వస్తున్న కథనాలపై సీఎం చంద్రబాబు స్పందించారు. తక్షణమే ఉల్లి రైతును ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. క్వింటం ఉల్లిని రూ.1,200కు చెల్లించి ఆదుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉల్లి రైతుల పరిస్థితి, ఉల్లి ధరలు, నిల్వలు ఉమ్మడి జిల్లాలో ఏ విధంగా ఉన్నాయో అనే అంశంపై సీఎం చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఉల్లి పంటకు సంబంధించిన క్రయ విక్రయాలపై చర్చించారు. ఉల్లి పంట దెబ్బతిన్న కారణంగా మహారాష్ట్రలో ఉల్లి పంట ఎక్కువగా ఉన్నందు వలన ధరల విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. రానున్న పది రోజుల్లో 5వేల మెట్రిక్ టన్నుల ఉల్లి పంట కర్నూలు యార్డుకు వచ్చే అవకాశం ఉందని సీఎంకు వారు వివరించినట్లు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు. శనివారం నుంచి కర్నూలు మార్కెట్ యార్డులో రైతులతో క్వింటం ఉల్లిని రూ.1200కు కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించారు.

## జీఎస్టీ సజావుగా చెల్లించాలి

**కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** చట్ట ప్రకారం జీఎస్టీ సజావుగా చెల్లించేలా ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జీఎస్టీ అంశంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్టర్ చేసుకోకుండా వ్యాపారాలు చేసేవారు కాంట్రాక్టర్లను రిజిస్ట్రేషన్ చేయించి జీఎస్టీ పన్ను చెల్లించేలా చూడాలని అన్నారు. ప్రైవేటు సంస్థలు, ఔట్‌సోర్సింగ్, ఇతర ప్రభుత్వ శాఖల్లో పని చేసే ఉద్యోగులు ప్రొఫెషనల్ ట్యాక్స్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ నీరజ, అడిషనల్ ఎస్పీ హుసేన్‌పీరా, డిప్యూటీ కమిషనర్ మురళీమోహన్ పాల్గొన్నారు.

# ఆక్రమణలు ఆగేనా?



ప్యాపిలి, ఫొటో నెం:3 [illegible]

నగరంలో ప్రవహించే హంద్రీ నదీతీరం ఇరువైపుల ఆక్రమణలకు అడుకట్ట పడేనా? ఇప్పటికే చేసిన ఆక్రమణలు తొలగిస్తారా? నదీతీరం సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటారా? [illegible] తులు కనువిందు చేస్తున్నాయని పర్యాటకులు చెప్పారు.

### కేంద్ర మార్గదర్శకాలు ఇవే..

- నదీతీరాల నుంచి 500 మీటర్ల దూరం వరకు ల్యాండ్ ఫీల్డ్ సైట్లు, మునిసిపాలిటీ, నగరపాలక సంస్థలు, పరిశ్రమల వ్యర్థాలు వేయరాదని నిషేధాజ్ఞలున్నాయి.
- ఐదేళ్లకు ఒకసారి వరదలు పునరావృతమయే ప్రాంతాలను ప్రొటెక్టెడ్ జోన్‌గా కేంద్రం ప్రకటించింది. తాజాగా మార్గదర్శకాలు ప్రకారం ఈజోన్‌లో శాశ్వత నిర్మాణాలు, వ్యర్థాలు వేయడం, ప్రమాదకర పదార్థాలు నిల్వ చేయడం నిషేధం.
- ప్రతి ఐదేళ్లకు ఒకసారి, పాతికేళ్లకు ఒకసారి వరదలు వచ్చే ప్రాంతాన్ని రెగ్యులేటర్ జోన్‌గా ప్రకటించారు. ఈ జోన్లో కార్యకలాపాలు కఠినంగా నియంత్రిస్తారు.
- పాతికేళ్లకు ఒకసారి, అదేవిధంగా ప్రతి 100ఏళ్లకు ఒకసారి వరదలు వచ్చే ప్రాంతాన్ని వార్నింగ్ జోన్‌గా పేర్కొన్నారు. ఇక్కడ ప్రమాదకర కార్యకలాపాలకు అనుమతి ఉన్నా, వరద ముప్పు అంచనాలు వేసి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటారు.
- హంద్రీ నదికి 1997 నుంచి 2009 వరకు 12 ఏళ్లలో నాలుగుసార్లు భారీ వరదలు వచ్చాయి. 2007, 2009లో మూడేళ్లలో రెండుసార్లు 2-3 లక్షల క్యూసెక్కులకు పైగా వరదలు వచ్చాయి. ఎప్పుడు వరద వస్తుందో? అంటూ నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఉంది. దీంతో ప్రొటెక్ట్ జోన్ జాబితాలో చేర్చాలని, కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు పేర్కొంటున్నారు.
- తుంగభద్ర నది మునగాలపాడు నుంచి జోహరాపురం వరకు కర్నూలు నగరం అంచున ప్రవహిస్తుంది. 2009లో వచ్చిన వరద ఊహకు అందనిది. ఈ నదీ తీరాన్ని కూడా ప్రొటెక్టెడ్ జోన్‌గా గుర్తించాలని పలువురు కోరుతున్నారు. మునగాలపాడు నుంచి రోజాదర్గా వరకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు నదీతీరం అంచుల్లో శాశ్వత భవనాలు నిర్మాణాలు చేస్తున్నారు. అంకురంలో అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

### నదీతీరంలో రహదారులు నిర్మించాలి

ప్రజలను వరద ముప్పు నుంచి రక్షించాలంటే నదీతీరాల్లో శాశ్వత భవనాలు నిర్మించకుండా చర్యలు తీసుకోవాలి. బఫర్ జోన్ ప్రాంతంలో విశాలమైన రోడ్లు నిర్మించాలి. రహదారులపై ప్రజలు, వాహనదారులు రాకపోకల వల్ల వరద ప్రమాదం గుర్తించి ముప్పు నుంచి రక్షణ పొందే అవకాశం ఉంది. నగరంలో హంద్రీ నదీతీరం ఇరువైపుల ఆక్రమణలు వాస్తవమే. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి, సరిహద్దులు గుర్తించడంతో పాటు ఆర్‌సీసీ దిమ్మెలు ఏర్పాటుచేశాం.

- బి.రామకృష్ణ, డీఈఈ, ఇరిగేషన్ ఎఫ్‌ఆర్‌ఎల్ డివిజన్, కర్నూలు

## ఆస్పరి మార్కెట్ వేలం రూ.కోటి

**ఆస్పరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** ఆస్పరి గ్రామ పంచాయతీ కూరగాయల మార్కెట్ వేలం పాట రూ.ఒక కోటి పలికిందని శుక్రవారం ఎంపీడీవో గీతావాణి తెలిపారు. ఆస్పరి గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా వేలం పాటలో పాల్గొని రూ. కోటికి దక్కించుకున్నాడని గ్రామ పంచాయతీ సర్పంచ్ రాధమ్మ, కార్యదర్శి విజయరాజు తెలిపారు. వేలంలో తొమ్మిది మంది కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. గత సంవత్సరం కంటే రూ.35 లక్షలు ఎక్కువ ఆదాయం వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణయాదవ్, సీఐ గంగాధర్, రాఘవేంద్ర, రంగనాథ్, యుగంధర్ పాల్గొన్నారు.

## యువతకు పుష్కలంగా ఉద్యోగావకాశాలు

- టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

**ఓర్వకల్లు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం హుస్సేనాపురం గ్రామంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 16347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించారన్నారు. పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహిస్తూ ప్రతి ఏటా మెగా డీఎస్సీ నిర్వహించి యువ ఉపాధ్యాయులతో విద్యా రంగాన్ని దేశంలోనే తొలి స్థానంలో నిలుపుతామన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో ముగ్గురిపై వేటు

**కర్నూలు అర్బన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** బాధ్యతలు విస్మరించారన్న ఆరోపణలపై ముగ్గురిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులు వచ్చినట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సమాచారం వెల్లడించారు. గతేడాదిగా జిల్లా కార్యాలయానికి సంబంధించి అద్దె, ఇతర ఖర్చుల లెక్కలు సమర్పించకపోవడం, అక్రమాలకు పాల్పడినట్లు ఏఐసీసీ దృష్టికి రావడంతో ఇద్దరు ఉద్యోగులను తొలగిస్తున్నట్లు అడ్మినిస్ట్రేషన్ ఇన్‌చార్జి ఎస్ఎస్ రాజా ఆదేశాలు జారీ చేశారు. అదేక్రమంలో మరో నాయకుడిని తొలగిస్తున్నట్లు ఏఐసీసీ క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ లింగంశెట్టి ఈశ్వరరావు జిల్లా కార్యాలయానికి ఉత్తర్వులు జారీ చేశారు.

## మార్కులు, ర్యాంకులు ప్రకటించాలి: డీటీఎఫ్



డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న డీటీఎఫ్ నాయకులు

**కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** డీఎస్సీ-2025లో ఎంపికైన అభ్యర్థుల మార్కులు, ర్యాంకులు ప్రకటించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్‌కు డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్రాముడు, గట్టు తిమ్మప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నం ఏసేపు కలిసి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డీఎస్సీ అభ్యర్థులందరికీ మార్కులు మాత్రమే ప్రకటించారని, దీని వలన పరీక్ష రాసిన అభ్యర్థులంతా గందరగోళానికి గురవుతున్నారన్నారు. ఏ ర్యాంకు వరకు ఎవరికి ఏ కేటగిరిలో ఉద్యోగం వచ్చిందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఎంపికైన జాబితాను నోటీసు బోర్డులో పెట్టాలని డిమాండ్ చేశారు.

## రేపటి నుంచి ఆర్టీసీ బస్సుల మళ్లింపు

**కర్నూలు క్రైం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** నగరంలో రేపటి నుంచి (ఆదివారం) నుంచి ఆర్టీసీ బస్సులు మళ్లిస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు. ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు, వినాయక నిమజ్జనం పురస్కరించుకుని ఈ మళ్లింపు ఉంటుందన్నారు. అనంతపురం, బెంగళూరు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు గుత్తి పెట్రోల్ బంకు, చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండుకు వచ్చేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. అలాగే డోన్, అనం తపురం, బెంగళూరు వైపు వెళ్లే బస్సులు కల్లూరు మీదుగా చెన్నమ్మ సర్కిల్, గుత్తి పెట్రోల్ బంకు వైపువెళ్లేలా ఏర్పాట్లు చేశామన్నారు.

## ఎంపీడీవోలకు డీఎల్‌డీవోలుగా పదోన్నతి

**కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న ఇద్దరు ఎంపీడీవోలకు డివిజినల్ లెవెల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎంపీడీవో అశ్విని కుమార్, కల్లూరు ఎంపీడీవో నాగేశాచల రెడ్డిలకు డీఎల్‌డీవోగా పదోన్నతి కల్పించారు. త్వరలో స్థానాలు కేటాయిస్తారు.

## జీవనశైలిలో మార్పుతో కొత్త వ్యాధులు

**కర్నూలు హస్పిటల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** ఆహారపు అలవాట్లు, మారుతున్న జీవనశైలితో కొత్త వ్యాధులు పుట్టుకొస్తున్నాయని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మహేశ్వర్ ప్రసాద్ అన్నారు. నగరంలోని డాక్టర్స్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం మహిళ ఆరోగ్య కార్యకర్తలతో ఆయన ఎన్‌సీడీ-4.0 పురోగతిపై సమీక్ష నిర్వహించారు. మారుతున్న జీవన విధానం వలన బీపీ, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, పక్షవాతం, నోటి, రొమ్ము క్యాన్సర్లకు ముందస్తుగా గుర్తించి చికిత్స చేయించుకోవా లన్నారు. కార్యక్రమంలో సంచార చికిత్స కార్యక్రమ అధికారి డాక్టర్ రఘు, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, డా.సునీల కుమారి, ప్రొజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

## వ్యక్తి అరెస్టు

**కర్నూలు క్రైం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు నాలుగో పట్టణ ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలి పారు. రాజశేఖర్ ఓ కాలేజీలో నర్సింగ్ చేస్తూ అదే కాలేజీలో నర్సింగ్ చేస్తున్న మరో యువతిని ప్రేమిస్తున్నానని నమ్మించాడు. వేరే మహిళతో సంబంధం పెట్టుకుని పెళ్లి చేసుకోకుండా మోసం చేయడంతో ఆ యువతి ఈనెల 21న పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## మహాసభలను జయప్రదం చేయాలి: సీఐటీయూ

**కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** ఈనెల 7న కర్నూలు మండల మహాసభలు, 27, 28 తేదీల్లో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.గౌస్ దేశాయ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కేకే భవన్‌లో సీఐటీయూ కర్నూలు మండల అధ్యక్షుడు హుస్సేనయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ బీజేపీ 11 సంవత్సరాల పాలనలో బడా పెట్టుబడిదారులు, కార్పొరేట్ల కోసమే కార్మిక చట్టాలలో అనేక మార్పులు తీసుకువచ్చిందని విమర్శించారు. బీసన్న, రాఘవేంద్ర, చెన్నయ్య, రమణ, ఏసు, ప్రభాకర్, రామయ్య పాల్గొన్నారు.

## కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలి

**కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం పాతబస్తీ జీబీ ఫంక్షన్ హాలులో సీఐటీయూ నగర మూడో మహాసభలు ప్రారంభమయ్యాయి. అంజిబాబు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మి హక్కులను కాల రాస్తుందన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజలపై అధిక భారాలు వేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌దేశాయ్, నగర అధ్యక్షుడు డి.అబ్దుల్ దేశాయ్, రాజశేఖర్, మహ్మద్, ఖాజాపాష, మారెళ్ల విజయ రామాంజనేయులు పాల్గొన్నారు.

## బకాయిలు సకాలంలో చెల్లించాలి: ఏడీ

**సి.బెళగల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించాలని ఏడీ జేసన్ వినియోగదారులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లో ఆయన విద్యుత్ వినియోగదారులతో సమావేశం నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ గ్రామాల్లోని వినియోగదారులు తమ వ్యవసాయ మోటార్ల దగ్గర మరమ్మతులు చేసుకునే సమయం లో విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈసమావేశంలో ఏఈ సుకుమార్, లైన్‌మెన్లు, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

## గణేశ్ ఉత్సవాలకు ఉచిత విద్యుత్‌పై హర్షం

**కర్నూలు అర్బన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో 15వేల గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ ప్రకటించడంపై టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్య క్షుడు సత్రం రామకృష్ణుడు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

## 1న మండల సర్వసభ్య సమావేశం

**కర్నూలు రూరల్, 29(ఆంధ్రజ్యోతి):** వచ్చే నెల ఒకటో తేదీన కర్నూలు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.రఘునాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ సమావేశ భవనంలో ఉదయం 10-45గంటలకు జరుగుతుందన్నారు. ఈసమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు. అధికారులు హాజరు కావాలని కోరారు.

## వెండి కిరీటం చోరీ

**కోడుమూరు రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** మండలంలోని ప్యాల కుర్తిలో వెలసిన వీరభద్రస్వామి ఆలయంలో వెండి కిరీటం గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. పూజారి వీరశైవ నాగేష్ తెలిపిన వివరాలివి. శుక్రవారం మధ్యాహ్నం పూజారి గుడి పక్క ఇంట్లో భోజనం చేయడానికి వెళ్లాడు. ఆ సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి బైక్ వచ్చి ఆలయంలోకి వెళ్లాడు. తిరిగి బయటకు వస్తున్న క్రమంలో పూజారి గమనించి ప్రశ్నించగా, స్వామివారికి టెంకాయ కొట్టి పూజ చేసినట్లు ఆ వ్యక్తి తెలిపాడు. అనంతరం పూజారి ఆలయం తాళం వేశాడు. తిరిగి సాయంత్రం పూజ చేయడానికి పూజారి తాళం తెరచి లోపలికి వెళ్లాడు. అయితే స్వామివారికి అలంకరించిన వెండి కిరీటం కనిపించలేదు. దీంతో విషయాన్ని గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లాడు. కిరీటం విలువ రూ.50 వేలు ఉంటుందని, జరిగిన ఘటనపై పోలీసులను ఆశ్రయించారు.

# వైభవంగా వినాయక నిమజ్జనం


కోడుమూరు: వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు

**కోడుమూరు రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** మండలంలోని పలు గ్రామాల్లో వినాయకుడి నిమజ్జనం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. మూడు రోజులపాటు పూజలందుకున్న విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ముందుగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీధుల్లో మేళ తాళాలు, డప్పుశబ్దాల మధ్య వినాయకుడిని ఊరేగించారు. విగ్రహాల ముందు చిన్నపిల్లలు, యువ కులు సంతోషాలతో డ్యాన్స్ చేశారు. వర్కూరు సద్గురు ఖాజాహుశేన్‌దాసు దర్గాలో ముస్లింలు వినాయక చవితి వేడుకలు జరిపించారు. లద్దగిరి, గోరంట్ల, వెంకటగిరి, బైనదొడ్డి, పులకుర్తి, ముడుమలగుర్తి, క్రిష్ణాపురం వంటి గ్రామాల్లో నిమజ్జనం జరిగింది.

**గణేశుడి లడ్డూ రూ.30 వేలు:** మండలంలోని లద్దగిరి గ్రామంలో గణేశుడి లడ్డూ వేలంలో రూ.30వేలు పలికింది. స్థానిక వై సర్కిల్ వద్ద శాంతి వినాయక బృందం ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహంపై ఉంచిన వివిధ పూజా ద్రవ్యాలు వేలం చేపట్టారు. ఇక్కడి లడ్డూను సురేంద్ర అనే యువకుడు వేలంలో కైవసం చేసుకున్నాడు. అలాగే వర్కూరు కమ్మరి కొలిమి వద్ద రూ.25వేలకు బట్టి సుంకన్న అనే వ్యక్తి దక్కించుకున్నాడు. అలాగే చింతతోట దారిలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద లడ్డూ వేలంలో రూ. 18 వేలు పలికినట్లు నిర్వాహకులు తెలిపారు.

**కోడుమూరు:** పట్టణంలో మూడు రోజుల పాటు పూజలు అందుకొన్న గణనాథుడిని భక్తులు శుక్రవారం నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనాలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

**ఓర్వకల్లు:** వినాయకుని చవితి పురస్కరించుకుని మూడు రోజులు పూజలందుకున్న వినాయకులను శుక్రవారం నిమజ్జనం చేశారు. మండలంలోని నన్నూరు, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, కొమరోలు తిప్పాయపల్లె, శకునాల, లొద్దిపల్లె, గుట్టపాడు, ఎన్.కొంతలపాడు తదితర గ్రామాల్లో గణనాథులను ట్రాక్టర్లపై ఏర్పాటు చేసి మేళతాళాలతో గ్రామాల్లో వీధుల్లో ఊరేగించారు. యువత కేరిం తలు వేస్తూ రంగులు చల్లుకుని సంబరాలు చేసుకున్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న చెరువులు, బావులు, కుంటల్లో వినాయకులను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. ఓర్వకల్లులోని రచ్చకట్ట వద్ద ఏర్పాటు చేసిన బొజ్జగణపయ్యకు భక్తులు పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

**గూడూరు:** మండలంలోని ఆర్ కానాపురం, చనుగొండ్ల గ్రామాల్లో గణేశ్ నిమజ్జనం శుక్రవారం వైభవంగా జరిగింది. ఆయా గ్రామాల్లోని వినాయక మండపాల్లో స్వామి వారికి పూజలు నిర్వహించి, లడ్డూ వేలం నిర్వహించారు. అనంతరం ఒక్కొక్కటిగా మండపాల నుండి వినాయక విగ్రహాలు ఊరేగింపుగా బయలు దేరాయి.

**సి.బెళగల్:** మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. నిమజ్జనంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ పరమేష్ నాయక్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.


లద్దగిరిలో లడ్డూ కైవసం చేసుకున్న సురేంద్ర


వర్కూరులో..


తెలికొంనగర్‌లో వినాయకుడి వద్ద భక్తుల కోలాహలం


వెంకటగిరిలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు


ఓర్వకల్లు మండలం కొంతలపాడులో..


సి.బెళగల్‌లో..

## ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి


ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ తదితరులు

**కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్‌ను క్రీడాకారులు ఆదర్శంగా తీసుకోవాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్థానిక డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో ధ్యాన్‌చంద్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేశారు. డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 1975 ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పలు క్రీడా పోటీల విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో భూపతి రావు, క్రీడా ప్రతినిధులు రామాంజనేయులు, దాసరి సుధీర్, నాగరత్నమయ్య, గంగాధర్, పరుశురాముడు, ప్రభాకర్, ప్రవీణ్ కుమార్, పాపా, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, నబీ సాహెబ్ పాల్గొన్నారు.

## షాపింగ్ కాంప్లెక్స్‌లకు మరమ్మతులు చేయాలి

**కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** నగరంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లకు మరమ్మతు పనులను చేపట్టాలని అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ ఆదేశించారు శుక్రవారం ఆయన నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 9 మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లను అధికారులతో కలిసి పరిశీలించారు. అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల ఆధునీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పైకప్పులపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు సూచించారు. డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, ఆర్‌ఓ జునైద్, ఆర్ఐ రాజు, తిప్పన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## నిర్మాణాలు నాణ్యతగా చేపట్టండి: డీఈఈ

**ఓర్వకల్లు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంకు నిర్మాణాలను నాణ్యతగా చేపట్టాలని క్వాలిటీ కంట్రోల్ డీఈఈ డీవీ మధుసూదన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కాల్వ గ్రామంలో రూ.1.11 కోట్లతో నిర్మిస్తున్న వాటర్ ట్యాంకు పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాసులు ఉన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ప్రతి శుక్రవారం 'ఓపెన్ ఫోరం'
- నగర పాలక కమిషనర్ విశ్వనాథ్

**కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నగర పాలక సమావేశ భవనంలో ఓపెన్ ఫోరం కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెరందిన పలువురు పౌరులు ఎల్‌ఆర్‌ఎస్, నిర్మాణ అనుమతులు, అక్రమ నిర్మాణాలపై అర్జీలు సమర్పించారు. పలువురు సందేహాలను వ్యక్తం చేయగా, కమిషనర్ నివృత్తి చేశారు. కొన్ని సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతుందని పౌరులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అక్కడిక్కడే పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులను కమిషనర్ కారణాలు అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా విని, తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు 'ఓపెన్ ఫోరం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. సమావేశంలో సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డీసీపీ బి.వెంకట రమణ, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్‌బాషా, సూపరింటెండెంట్ సుబ్బన్న, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, ప్లానింగ్ కార్యదర్శులు, ఎల్‌టీపీలు, ప్రజలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథ్

## సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే

**కల్లూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శుక్రవారం మాధవీనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల సమస్యలపై ఎమ్మెల్యే అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

## ఉప ముఖ్యమంత్రిని కలిసిన చింతా సురేష్

**కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా ప్రతినిధి చింతా సురేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం విశాఖపట్టణంలోని స్థానిక హోటల్‌లో పవన్ కల్యాణ్‌ను కలిసి జిల్లాలో రాజకీయ పరిస్థితి, పార్టీ బలోపేతం తదితర అంశాలపై మాట్లాడినట్లు సమాచారం.

## నేడు మున్సిపల్ దుకాణాలకు వేలం

**కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** నగర పాలక పరిధిలో 25 సంవత్సరాల కాలపరిమితి పూర్తి చేసుకున్న దుకాణాలతోపాటు క్రికెట్ నెట్, టెన్నిస్ కోర్టులకు శనివారం వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎస్‌బీఐ కాలనీలోని నగర పాలక కౌన్సిల్ హాలులో నిర్వహించే వేలం కార్యక్రమానికి రెవెన్యూ సిబ్బందికి విధులు కేటాయించారు. మొత్తం 37 మున్సిపల్ దుకాణాలకు వేలం నిర్వహించనున్నారు.

## డీఎస్సీ అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి

**కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** మెగా డీఎస్సీ అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం డీఈవో శామ్యూల్ పాల్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో వేలాది మంది నిరుద్యోగులు డీఎస్సీ పరీక్షలు రాసి నోటిపై చేసిన పోస్టులకు ఎన్నికైన వారికి గత రెండు రోజులుగా వెరిఫికేషన్ చేస్తున్నారన్నారు. అయితే ఆయా క్యాడర్లలో ఎంపిక విధానంలో కొన్ని అంశాలపై స్పష్టత లేకపోవడంతో అభ్యర్థులు టెన్షన్‌కు గురవుతున్నారని అన్నారు. మొదటి రోజు ఈ పరిశీలనలో తలెత్తిన అనేక సమస్యలకు కొంత స్పష్టత వచ్చినప్పటికీ రిజర్వేషన్, సామాజిక వర్గాలకు జరిగిన అన్యాయాలను, టెక్నికల్ సమస్యలను నాలుగో జోన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సామేల్ డీఈవోకు వివరించారు. సోషల్ సబ్జెక్టు మెరిట్‌లో ముందున్నప్పటికీ అతని వెనుక ఉన్న అభ్యర్థికి కాల్ లెటర్ రావడం మధు కిరణ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులో మాజీ సైనిక కోటాలో నాలుగు పోస్టులకు గానూ ఈయన రెండో ర్యాంకు ఉన్నప్పటికీ, ఆ తర్వాత మూడో ర్యాం కు అభ్యర్థికి కాల్ లెటర్ రావడం మీనుగ రమణ బీసీ-ఏ ఎస్‌జీటీ పోస్టులో ఈయన కన్నా వెనుక తక్కువ మార్కులు ఉన్న అభ్యర్థికి కాల్ లెటర్ వచ్చిందన్నారు. నాన్‌లోకల్ అభ్యర్థుల్లో మొదటి ర్యాంకు వచ్చిన వారికి కాల్ లెటర్ రాకపోవడం వంటి సమస్యలు, టెక్నికల్ సమస్యలపై ఫిర్యాదు చేశామన్నారు. ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కడప ఆర్జేడీ శామేల్ తెలిపారు. ఆర్జేడీని కలిసిన వారిలో ఏపీటీఎఫ్ నాయకులు ఇస్మాయిల్, మరియానందం, జి.లక్ష్మయ్య, తదితరులు ఉన్నారు.

# ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

**కర్నూలు కల్చరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** సాహితీ స్రవంతి నగర శాఖ ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సాహితీ స్రవంతి కార్యాల యంలో జరిగిన ఈ వేడుకల్లో గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెలుగు భాష మాధుర్యాన్ని వక్తలు తెలియజేశారు. కార్యక్రమంలో స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్. సభ్యులు డి. పార్వతయ్య, విజయులు తనగల, సూర్యప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

● అభ్యుదయ రచయిత సంఘం (అరసం) ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అరసం నగర ప్రధాన కార్యదర్శి జీవీ ప్రమోద్ చక్రవర్తి మాట్లాడుతూ గిడుగు అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడిచి తెలుగు భాషను కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసరం నగర సహాయ కార్యదర్శి డి. వెంకటరమణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ లెనిన్‌బాబు, నగర సహాయ కార్యదర్శి జి.చంద్రశేఖర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, నాయకులు రాజశేఖర్, వీరేష్ పాల్గొన్నారు.

**కర్నూలు అర్బన్:** ప్రతి విద్యార్థి తెలుగును తప్పని సరిగా అధ్యయనం చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఉస్మానియా కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. శ్రీదేవి మాట్లాడుతూ ఎన్ని భాషలు నేర్చుకున్నా తెలుగు భాషను మరవకూడదన్నారు. ఉస్మానియా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్ మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి వ్యవహారిక భాషా ఉద్యమాన్ని గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఏఎం ఘజనీ, తెలుగు శాఖాధిపతి డాక్టర్ మండి అన్వర్ హుస్సేన్ అధ్యాపకులు జే.సునీత, కె.అరుణ కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

● తెలుగు భాషా పరిరక్షణకు గిడుగు రామ్మూర్తి సేవలు ఎనలేనివని ప్రిన్సిపాల్ ఆదినారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఉన్నత విద్యా ఆధ్యయన సంస్థ ఉపాధ్యాయ శిక్షణా కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జేఎస్‌ఆర్‌కే శర్మ ఆధ్యాపకులు ప్రొ ఫెసర్ దండబోయిన పార్వతి దేవీ, వైస్ ప్రిన్సిపాల్ కేవీ మధుసూదన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

● గిడుగు రామ్మూర్తి సేవలు చిరస్మరణీయమని ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జే.హేమంత్ సత్యనా రాయణ, సయ్యద్ ఫక్రున్నీసా బేగం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● తెలుగు భాషను మరవద్దు అంటూ క్లస్టర్ వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ జి. శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో తెలుగుభాషా, జాతీయ క్రీడాదినోత్సవాలను నిర్వహించారు. గిడుగు రామమూర్తి పంతులు, ధ్యాన్ చంద్ జయంతిలను పురస్కరించుకుని వారి చిత్ర పటాలకు నివాళి అర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ బీఆర్ ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ కె.నాగేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**కర్నూలు ఎడ్యుకేషన్:** స్థానిక సంతోష్‌నగర్‌లోని టాటా సంసిద్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలుగు బాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తెలుగు తల్లి, శ్రీకృష్ణదేవ రాయలు, గిడుగు రామ్మూర్తి, గురజాడ అప్పారావు, సావిత్రీ బాయి పూలే వేషధారణలో అలరించారు. అనంతరం చిన్నారులు ఆటల పాటలతో నృత్యాలతో పాఠశాల ప్రాంగణం హోరెత్తింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● స్థానిక అబ్బాస్‌నగర్‌లోని రవీంద్ర పాఠశాలలో గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగుభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య, విద్యాసంస్థల అకడమిక్ అడ్వైజర్ డా.మమతా మోహన్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వంశీధర్, కోఆర్డినేటర్ హేమలత, చంద్రశేఖర్, స్వాతి, తెలుగు భాషా బోధకులు మధు, బాలకృష్ణ విద్యార్థులు పాల్గొన్నారు.



గిడుగు చిత్రపటానికి పూలమాల వేస్తున్న సాహితీ స్రవంతి నగర శాఖ ప్రతినిధులు



నివాళి అర్పిస్తున్న అరసం ప్రతినిధులు



కేవీఆర్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

# ఆదోని



## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

**తుగ్గలి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో పాల్గొని రాణించాలని పీఈటీల సంఘం జిల్లా కార్యదర్శి చందు నాయక్ అన్నారు. శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా తుగ్గలిలో విద్యార్థులకు క్రీడల పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శారీరకంగా, మానసికంగా ఎదగాలంటే క్రీడలు ఎంతో దోహదపడుతాయని, క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.


## 15 లోపు ఈక్రాప్ పూర్తి చేయాలి

**మద్దికెర ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** మండలంలో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల వివరాలతో పాటు సంబంధిత రైతును పొలంలో ఈక్రాఫ్ నమోదు కార్యక్రమాన్ని సెప్టెంబరు 15వ తేదీలోపు పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ అధికారి రవి తెలిపారు. శుక్రవారం మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం తదితర ప్రాంతాల్లో ఈక్రాఫ్ నమోదును ఏవో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా ఈక్రాఫ్ చేయించాలని, లేనియెడల ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ పథకాలు అందవన్నారు. కార్యక్రమంలో వీఏఏలు ఆనంద్, రేష్మా ఉన్నారు.

## సులభ పద్ధతిలో బోధన అందించాలి

**మద్దికెర ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు సులభ పద్ధతిలో భోదన అందించాలని మండల విద్యాధికారి రంగస్వామి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సకాలంలో విధులకు రావాలన్నారు. ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

## వీఆర్ఏ మృతి



లక్ష్మన్న (ఫైల్)

**తుగ్గలి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఉప్పర్లపల్లి గ్రామ వీఆర్ఏ లక్ష్మన్న (56) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రవి, డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్, ఆర్ఐ వెంకట్రాముడు గ్రామానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం రూ.20వేల ఆర్థిక సాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే ఉప్పర్లపల్లి సింగిల్ విండో సొసైటీ అధ్యక్షులు అప్పా వేణుగోపాల్, సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు గౌడు, వీఆర్వో రాజేశ్వరి తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

## రహదారికి మరమ్మతులు చేపట్టాలి

**తుగ్గలి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఉప్పర్లపల్లి దళిత కాలనీలోని ప్రధాన రహదారికు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల అధ్యక్షులు శ్రీరాములు, కోరారు. శుక్రవారం వారు మాట్లా 15 రోజుల క్రితం కురిసిన వర్షాలకు గుంతలు పడ్డాయన్నారు. వెంటనే రహదారిని మరమ్మతులు చేపట్టాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. అనంతరం వీఆర్వో రాజేశ్వరికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్ రెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు



మురుగు వద్ద స్ప్రే చేస్తున్న సిబ్బంది

**ఆదోని టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) :** పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డా. సందీప్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అన్ని వార్డులలోని కాల్వల్లో దోమల వృద్ధి జరగకుండా తిమ్మెట్ ద్రావకాన్ని స్ప్రే చేయిస్తున్నామని అన్నారు. వర్షాకాలంలో కొత్త నీరు సరఫరా జరుగుతున్న నేపథ్యంలో నీటిని వేడి చేసి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు.

## క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదు

**మద్దికెర ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదని, మందులతోనే నయం చేసుకోవచ్చని ప్రభుత్వ వైద్యాధికారి రాగిని అన్నారు. శుక్రవారం మండలంలోని మదనంతపురం గ్రామంలో క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ దగ్గు తగ్గకుంటే గల్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే వారికి ప్రభుత్వం అన్ని రకాల మందులు ఉచితంగా ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమ్మ, క్షయ పర్యవేక్షకులు వీరన్న, మమత, మండల సీపీఐ సహాయ కార్యదర్శి హనుమన్న, తదితరులు ఉన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

**ఆలూరు రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** ప్రకృతి వ్యవసాయం సాగుతో రైతులకు మేలు జరుగుతుందని ఆలూరు ఏడీఏ చెంగలరాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలకు రెండురోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా అనేక రకాల పంటలు వేసుకుని ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ఇందిరా, ఏఓ వెంకటేశ్వరగౌడ్, ఎన్ఎఫ్ఏ మల్లికార్జున, యంటి రేవన్న తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి శాంతి హోమాలు



మద్దికెరలో హోమాల చేస్తున్న భక్తులు

**మద్దికెర ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** స్థానిక మద్దమ్మకుంట సమీపాన వెలసిన సుబ్రహ్మణ్యం స్వామి శాంతి హోమాలు వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం స్థానిక సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో ఉదయం మూలవిరాట్ సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన నిర్వహకులు విజయప్రసాద్ యాదవ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు సన్మానం



టీచర్లను సన్మానిస్తున్న డీఈవో శ్యాముల్‌పాల్

**దేవనకొండ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** తెర్నేకల్ పాఠశాలలో చదివి టీచర్ ఉద్యోగాలు సాధించిన 25 మంది అభ్యర్థులను డీఈవో శ్యాముల్‌పాల్, కడప ఆర్‌జేడీ ప్రతాప్‌రెడ్డి సన్మానించారు. కర్నూలు రాయలసీమ యూనివర్శిటీలో సర్టిఫికేషన్ల వేరిఫికేషన్ అనంతరం వారిని అభినందించారు. ఒకే గ్రామం నుండి 21 మంది, అదే గ్రామంలోని పాఠశాలలో మరో నలుగురు డీఎస్సీలో ఉద్యోగాలు సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు రాజశేఖర్, గ్రామ సర్పంచు అరుణ్‌కుమార్ ఉన్నారు.

## జూదరుల అరెస్టు

**ఆదోని రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) :** ఆదోని మండలం 104బసాపురం గ్రామ సమీపంలో పేకాట స్థావరంపై ఇస్పీ పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్ఐ డాక్టర్ నాయక్ సిబ్బందితో కలిసి శుక్రవారం 10మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9వేలు నగదు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



పత్తికొండలో నిమజ్జనం చేస్తున్న దృశ్యం



నాగనాథనహళ్ళిలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



హొళగుందలో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథులు

# బైబై గణేశా

● ఘనంగా వినాయక నిమజ్జనం



తొగల గల్లులో



ఆస్పరిలో...



ఆలూరులో...

**పత్తికొండ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** పత్తికొండ పట్టణంతో పాటు మండల పరిధిలో వినాయక నిమజ్జనం శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. పత్తికొండ పట్టణంలో కొలువైన భారీ విగ్రహాలు ఊరేగింపులో మిగిలిన విగ్రహాలకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సీఐ జయన్న ఆధ్వర్యంలో పోలీసులు గట్టీ బందోబస్తు నిర్వహించారు. ఆదోని బైపాస్‌లో వినాయక ఘాట్ వద్ద డిప్యూటీ ఎంపీడీవో నరసింహులు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది విగ్రహ నిమజ్జనాన్ని చేపట్టారు.

**తుగ్గలి:** మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం గణేష్ నిమజ్జనం ఘనంగా జరిగింది. సాయంత్రం యువతీ యువకులు ఉత్సాహంతో రంగులు చల్లుకుంటూ ఉట్టి వేడుకలు నిర్వహించి, గణనాథుల లడ్డూ వేలాలు నిర్వహించారు. ఎలాంటి అల్లర్లు జరగకుండా పత్తికొండ సీఐ పులిశేఖర్, ఎస్ఐలు బాలనరసింహులు, మల్లికార్జునలు బందోబస్తు నిర్వహించారు.

**దేవనకొండ :** మండలంలో వైభవంగా వినాయకుడి నిమజ్జన జరిగింది. దాదాపు రెండు వందలకుపైగా విగ్రహాలు, మండలంలో గత మూడు రోజుల క్రితం కొలువై శుక్రవారం గణేశుని మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ సమీపాలలోని చెరువులు, బావులు, కుంటల వద్ద ప్రజలు విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఆవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ వంశీనాథ్ 40 మంది సిబ్బంది విధులు నిర్వహించారు.

**మద్దికెర:** మండలంలో మద్దికెర, ఎం.అగ్రహారం పెరవలి, తదితర గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మూడోరోజు గణనాథులను నిమజ్జనం చేశారు.

**వెల్దుర్తి:** మండలంలో బొమ్మిరెడ్డిపల్లె, రామళ్లకోట, పుల్లగుమ్మి, కలగొట్ల, గోవర్ధనగిరి తదితర గ్రామాలలో ఉత్సవ నిర్వాహకులు వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించారు. నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టీ బందోబస్తు చర్యలు చేపట్టారు.

**ఆస్పరి:** మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం వినాయకుడి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు

**ఆలూరు:** ఆలూరు మండలంలోని అన్ని గ్మారాల్లో కొలువుదీరిన గణనాథులు శుక్రవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు నిమజ్జనానికి తరలించారు. వినాయకులను ఊరేగిస్తూ బాపురం కాలువలో నిమజ్జనం చేశారు. సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్ఐ మహబూబ్‌బాషాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

**హొళగుంద:** ల్లార్తి, వందవాగాలి, గజ్జేహళ్లి, హెబ్బటం తోపాటు హొళగుందలో గణేశ నిమజ్జనం అంగరంగా వైభవంగా సాగింది. యువత సంతోషంగా రంగులు చల్లుకుని మహా గణపతి ఊరేగింపు చేశారు. ఎల్‌ఎల్‌సీ కాలువ నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య ఆధ్వర్యంలో ఆలూరు సీఐ రవి శంకర్ రెడ్డి, ఎస్ఐ గురజాల దిలీప్ కుమార్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ఆదోని రూరల్ :** ఆదోని మండలంలోని గ్రామాల్లో శుక్రవారం వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది.ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



తుగ్గలిలో...



దేవనకొండలో...



మద్దికెరలో...



పత్తికొండలో...

## పవర్‌గ్రిడ్ కోసం భూములు ఇవ్వం

**ఆలూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** పవర్ గ్రిడ్ సోలార్ కోసం రైతుల భూములు ఇవ్వరని బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామలింగయ్య అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ భూసేకరణలో భాగంగా చిన్న, సన్నకారు రైతులతో బలవంతంగా భూములు లాక్కుంటున్నారని ఆరోపించారు. ఆలూరు నియోజకవర్గంలోని మనెకుర్తి, మరకట్టు, హులేబీడు, చిన్నహోతూరు, కమ్మరచేడు, కాత్రికి గ్రామాల్లో ప్రభుత్వ అధికారులచే పవర్ గ్రిడ్ వారు భూములు రాయించుకోవడం తగదన్నారు. పార్టీలకు అతీతంగా నాయకులు, రైతులు అండగా నిలవాలని కోరారు.

## మనేకుర్తి గ్రామ మాజీ సర్పంచ్ మృతి

**ఆలూరు రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని మనేకుర్తి గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకురాలు యం.కురువ హనుమంతమ్మ(79) శుక్రవారం మృతిచెందారు. గత కొంతకాలంగా హనుమంతమ్మ అనారోగ్య సమస్యతో కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ గ్రామానికి చేరుకొని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు. టీడీపీ జిల్లా నాయకు డు వంశీధర్‌రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ కురువ జయరాం తనయుడు రఘుబాబు, మండల కన్వీనర్ అశోక్‌యాదవ్, కమ్మరచేడు మాజీ ఎంపీటీసీ మద్దిలేటియాదవ్, దిబ్బనకల్ సర్పంచ్ లక్ష్మ న్న, మాజీ ఎంపీటీసీ గోపాల్‌లు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

## జర్నలిస్టుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**వెల్దుర్తి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడు డిమాండ్ చేశారు. శుక్రవారం వెల్దుర్తి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల ఏపీయూడబ్ల్యూజే సమావేశానికి జరిగింది. నాగరాజుగౌడు మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని, అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని, యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్, రైల్వే పాస్‌లు పునరుద్దరించాలన్నారు. అలాగే కార్పొరేట్ స్కూల్స్‌లో వంద శాతం రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఈశ్వరయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసగౌడు, నియోజకవర్గ నాయకుడు సాలు రంగడు తదితరులు పాల్గొన్నారు.

## చెన్నంపల్లిలో సుంకల పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ



పూజలందుకుంటున్న అమ్మవారు

**ఆస్పరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో సుంకల పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, గంగపూజ, హోమాలు, కుంకుమార్చన తదితర విశేష పూజలు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకటేశులు, శ్రీనివాసులు, తిక్కయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

## వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

**వెల్దుర్తి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డీఎల్పీవో లక్ష్మీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్మికులను మూడు సచివాలయాలకు అనుసంధానం చేయాలన్నారు. వీధులలో చెత్తచెదారం, డ్రైనేజీ కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుహాసినమ్మ, డిప్యూటీ ఎంపీడీవో రవికిశోర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనాథ్, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## గోదాం తనిఖీ



గోదాంను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

**ఆదోని, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** పౌర సరఫరాల గోదాం పాయింట్‌ను సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ శుక్రవారం తనిఖీ చేశారు. గోదాములో ఉన్న రేషన్ నిల్వలు, రికార్డుల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను స్వయంగా పరిశీలించారు. గోదాములో బియ్యం సంచులు లూజు ఉండడాన్ని గమనించారు. ఇలా ఉండడం ఏమిటని అక్కడ ఉన్న అధికారులను ప్రశ్నించారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ బియ్యం కార్డు లబ్ధిదారులకు పంపిణీ చేసే ప్రక్రియలో ఎటువంటి లోపాలు లేకుండా పూర్తి స్థాయిలో పారదర్శకతతో వ్యవహరించాలని సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఉప తహసీల్దార్ రవీంద్రారెడ్డి, పౌర సరఫరాల రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



అమ్మవారికి పూజలు చేస్తున్న వైకుంఠం జ్యోతి

**ఆలూరు రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** సీఎం చంద్రబాబునాయుడితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర మహిళా నాయకురాలు వైకుంఠం జ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం ఆలూరులోని కోట వీధిలోని సుంకులమ్మదేవి ఆలయంలో అమ్మవారికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను, హామీలను అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచాడన్నారు. మరో 15 ఏళ్ల కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంటుందన్నారు.

## క్రీడాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

● ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

**ఆదోని అగ్రిలక్చర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) :** ఆదోనిలో జాతీయస్థాయి క్రీడాకారులు ఉన్నారని క్రీడాభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త, తాలూకా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విట్టా రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం ఆదోని వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ముందుగా మునిసిపల్ క్రీడా మైదానంలో ఉన్న ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జాతీయ, రాష్ట్ర స్థాయి, మాస్టర్ అథ్లెట్, సీనియర్ క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథులుగా విట్టా రమేష్, రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి, ఎంఈవోలు భూపాల్ రెడ్డి శ్రీనివాసులు హెచ్‌ఎంలు మల్లికార్జున, పాయాజ్ అహ్మద్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సైఫుల్ల, కమ్మిరెడ్డి, ముజీబ్ రిటైర్డ్ పీడీలు నరసయ్య, ఎల్‌కే చిన్నప్ప, ఈరన్న పాల్గొన్నారు. వ్యాయామ ఉపాధ్యయ సంఘం నాయకులు నరసింహరాజు, రామన్న షాబీర్ పాల్గొన్నారు.

## ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



ఆదోని దొడ్డనకేరి జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న సీఐ శ్రీరామ్, గదాద్రి దత్తాత్రేయ శర్మ



పత్తికొండలో...

**ఆదోని అగ్రిలక్చర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) :** వ్యవహార భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి 162వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఆదోని నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని దొడ్డనగేరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పద్యాలతో రణం, వ్యాసరచన, వకృత్వ పోటీ, సాంప్రదాయ వస్త్ర ధారణ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీరామ్, కర్నూల్ 3 టౌన్ సీఐ శేషయ్య, తెలుగు యువత నాయకుడు సిద్దార్థ నాయుడు, రజక కార్పొరేషన్ సావిత్రి, సుస్వరం నాగరాజు, వీహెచ్‌ఎస్‌రాష్ట్ర అధ్యక్షుడు రామాంజినేయులు పాల్గొని బహుమతులను ప్రదానం చేశారు. గదాద్రి దత్తాత్రేయ శర్మ, హెచ్ఎం వెంకటస్వామి ఉపాధ్యాయులు, ప్రేమ్ కుమార్, లింగన్న పాల్గొన్నారు. మునిసిపల్ హైస్కూల్‌ల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని, హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని క్రీడా దినోత్సవాన్ని మునిసిపల్ హైస్కూల్లో హెచ్‌ఎం మల్లికార్జున ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు.

● ఆర్ఆర్ లేబర్ కాలనీలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి ఆధ్వర్యంలో తెలుగు భాష క్రీడల దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు ఉపాధ్యాయుడు ప్రహల్లాద పీడీ రామకృష్ణను ఘనంగా సన్మానించి క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు వీర చంద్ర యాదవ్, శ్రీరాములు పాల్గొన్నారు.

● పట్టణంలోని మిల్టన్ గ్రామర్ ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ రమేష్ బాబు ఆధ్వర్యంలో నేషనల్ విద్యాసంస్థలలో కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో అమరావతి ఇంటర్నేషనల్ పాఠశాలలో గుడిసె రామకృష్ణ ఆధ్వర్యంలో తెలుగు భాష. దినోత్సవాన్ని, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. గిడుగు రామ్మూర్తి ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాల వేసి బహుమతులు ప్రదానం చేశారు.

ఆదోని టౌన్ : ఆవోపా, వామ్ ఆధ్వర్యంలో లీలాస్ పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అధ్యక్షుడు శ్రీనాథ్ గుప్తా మాట్లాడుతూ, మన మాతృభాష అయిన తెలుగు భాషా ప్రత్యేకతను, ప్రాధాన్యతను గురించి వివరించారు. తెలుగు వెలుగు అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు కంబిరెడ్డి, హెచ్‌ఎం రమాదేవి ఆవో పా సభ్యులు శ్రీనాథ్ గుప్తా, రఘు, వెంకటేశ్వర్లు మహిళా విభాగ్ అధ్యక్షురాలు మమతా శ్రీ, శ్రీదేవి, అనిత ప్రసన్న, లక్ష్మి పాల్గొన్నారు.



ఆదోని ఆర్ఆర్ లేబర్ కాలనీలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



నేషనల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో...

**పత్తికొండ:** తెలుగు వాడుక భాష అభివృద్ధికి గిడుగు రామ్మూర్తి ఎంతో కృషిచేశారని శాంతి టాలెంట్ ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మీ అన్నారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో గిడుగు 162వ జయంతి కార్యక్రమాలు నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అరసం జిల్లీ ప్రధాన కొత్తపల్లి సత్యనారాయణ సిబ్బంది ఉన్నారు.

**దేవనకొండ:** మాతృ భాష తెలుగు కన్నతల్లి లాంటిదని మరవకూడదని వీబీఆర్ పాఠశాల హెచ్‌ఎం సుభాన్ అన్నారు. స్థానిక వీబీఆర్ పాఠశాలలో తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగుభాష దినోత్సవం జరుపుకున్నారు. తిక్కన్న, నన్నయ్య, ఎర్రన్న వేషధారణలతో విద్యార్థులు అలరించారు. హరీష్, మనోహర్, ప్రశాంత్, మౌనిక, అనసూయ, ఝాన్సీ, తదితరులు ఉన్నారు.

## పోలీసులకు ఎస్ఐ సన్మానం


హెడ్ కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న ఎస్ఐ

**నందవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** మండలంలో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ కొదండరామిరెడ్డి, పోలీసు నరేంద్రను శుక్రవారం నందవరం ఎస్ఐ కేశవ పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు. గత వారంలో నందవరంలో మిస్సింగ్ కేసును వారంలోపు చేదించి అమెను వారి కుటుంబ సభ్యులకు అప్పజెప్పినందుకు. దీంతో ఎస్పీ విక్రాత్ పాటిల్ పోలీసులకు అవార్డు ఇచ్చి సన్మానించారు. అలాగే అదే రోజు ఎమ్మిగనూరు పట్టణంలో ఓ.. హోటల్‌లో అల్పహారానికి వచ్చిన రిటైర్డు ఉద్యోగి రాజశేఖర్‌కు గుండెపోటు రావడంతో వెంటనే ఆయన చాతీపై 10 నిముషాలు సీపీఆర్ చేసి ఆయన ప్రాణాలు కాపాడిన హెడ్ కానిస్టేబుల్‌కు ఎస్ఐ స్టేషన్‌లో శాలువ కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాటి మనిషి ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్నా వ్యక్తిని కాపాడి మానవత్యం చాటుకున్నాడని ఎస్ఐ కొనియాడారు.ఆయనతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఉనికి కోసమే వైసీపీ ఆరాటం'

**నందవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** ఉనికి కోసమే వైసీపీ పార్టీ నాయకులు ఆరాట పడుతున్నారని టీడీపీ జిల్లా ఉపాధ్యాక్షుడు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ దేశాయి మాదవరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ టీడీపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బాబు షూరీటీ-మోసం గ్యారేటీ కార్యక్రమాలతో ప్రజల దగరకు వెళ్త అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఎన్నికలు ముందు టీడీపీ ఇచ్చిన హమీలన్ని దశల వారిగా నెరవేరుస్తు వస్తున్నారన్నారు చెత్తపైన కూడా పన్ను వేసిన ఘనత వైసీపీదే అన్నారు. వైసీపీ నాయకులు టీడీపీపై విమర్శ చేసేటప్పడు నిజాలు తెలుసుకుని మాట్లాడలని హితవు పలికారు.

## యూరియా కోసం విఘ్నేశ్వరుడికి వినతిపత్రం


వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

**కౌతాళం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** కౌతాళం మండల రైతులకు సరిపడా యూరియాను అందేలా చూడాలంటూ శుక్ర వారం రైతు సంఘం నాయకులు గణపతి మండపాల వద్ద గణనాథులకు వినతి పత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో మండల రైతులు పత్తి, మిరప, వేరుశెనగ పంటలను సాగు చేశారని పంటలు బాగా పండినా వాటికి తగినంత ఎరువులు వేయాలనుకున్నా అందుబాటులో తగినంత యూరియా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని యూరియా కోసం రైతులు వ్యవసాయాధికారుల చుట్టూ ప్రైవేటు డీలర్ల చుట్టూ తిరిగినా యూరియా మాత్రం దొరకడం లేదన్నారు. ప్రభుత్వం రైతుల బాధలు పట్టించుకోవడం లేదని గణనాధుడే రైతులను ఆదుకోవాలని మండలానికి 2వేల టన్నుల యూరియా చేరేలా చూడాలంటూ గణపతికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వీరేష్, ఉలిగప్ప, సత్యప్ప, ఖాదర్ బాష ఉన్నారు.

## నందమూరి హరికృష్ణకు ఘన నివాళి


హరికృష్ణ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎన్టీఆర్, ఎన్కేఆర్, టైగర్ టీమ్ ఫ్యాన్స్

**మంత్రాలయం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం మండలంలోని మాధవరంలో నందమూరి హరికృష్ణ వర్ధంతిని జూ.ఎన్టీఆర్, ఎన్కేఆర్, టైగర్ టీమ్ ఫ్యాన్స్ నిర్వహించారు. శుక్రవారం మాధవరం సర్కిల్‌లో టైగర్ టీం తాలుకా అధ్యక్షులు మహ్మద్ రఫీక్, గౌరవాధ్యక్షులు బారికి ఉరుకుంద ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉచితంగా అన్నదానం, పండ్లు, బ్రెడ్లు అందజేశారు. నందమూరి తారక రామారావు తనయుల్లో హరికృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ ఎన్నో పాత్రలు పోషించి ఫ్యాన్స్‌ను అభినందించారనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో టైగర్ టీమ్ ఫ్యాన్స్ షఫీ, నల్లారెడ్డి, అనిల్, నరసింహులు, ఆచారి, నరేష్, శంకరప్ప, మహేష్, నాగరాజు, టెంపర్, గిడ్డ పాల్గొన్నారు.

## కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

**కోసిగి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆదోనిలో నిర్వహించి అథ్లెటిక్స్, ఖో-ఖో, కబడ్డీ 100 మీటర్లు, 800 మీటర్లు లాంగ్ జంప్ పోటీల్లో కోసిగి కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు అన్నింటిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి చాంపియన్‌షిప్‌తో పాటు షీల్డ్‌లు, మెమెంటోలు అందుకున్నారు. అథ్లెటిక్స్ 100 మీటర్లలో డివిజన్ స్థాయిలో మొదటి స్థానం, 100, 800 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, లాంగ్‌జంప్‌లో మూడో స్థానం, కబడ్డీలో రన్నర్‌గా, ఖో-ఖోలో మూడో స్థానంలో విజయాలు సాధించి చాంపియన్‌షిప్‌ను విద్యార్థినులు కైవసం చేసుకున్నారు. పీఈటీ సుమ ఆధ్వర్యంలో విద్యార్థులు పలు క్రీడల్లో రాణించి మెమెంటోలును ఆదోనిలో జాతీయ క్రీడా దినోత్సవం రోజు న అతిథుల చేతుల మీదుగా అందుకున్నారు. కోసిగిలోని కేజీబీవీ విద్యార్థినులు అన్నీ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడం పట్ల కోసిగి మండల ప్రజలు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




గోనెగండ్లలో..


గాజులదిన్నె ప్రాజెక్టులో నిమజ్జనం చేస్తున్న భక్తులు


కౌతాళంలో..

# గంగ ఒడికి గణనాథులు

- కోలాహలంగా నిమజ్జన వేడుకలు
- ఎమ్మిగనూరులో 350 విగ్రహాలు
- యువత కేరింతల మధ్య సాగిన ర్యాలీ


ఎమ్మిగనూరులో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథులు


పెద్దకడబూరులో..


నందవరంలో..

**ఎమ్మిగనూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** పట్టణంలో వినాయకుడి నిమజ్జనాన్ని భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలో దాదాపు 350కి పైగా విగ్రహాలు ఏర్పాటు చేయగా మూడవ రోజున పట్టణంలో ఉన్న అన్ని వినాయక మండపాల్లోని వినాయవిగ్రహాలకు ప్రత్యేకపూజలు చేసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో పట్టణశివారులో ఉన్న ఎల్లెల్సీ కాలువలో నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ భార్గవి పర్యవేక్షణలో పట్టణ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్ఐలు,పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

**ఎమ్మిగనూరు రూరల్:** మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో కొలువైన వినాయక విగ్రహాలకు భక్తులు శుక్రవారం ఘనంగా నిమజ్జం చేశారు. చిన్నారుల కోలాటాలు, డప్పు వాయిద్యాలతో ఆయా గ్రామాల్లో ఉన్న ఎల్లెల్సీ, చెరువుల్లో వినాయక విగ్రహాలను ఘనంగా నిమజ్జనం చేసి మొక్కులను తీర్చుకున్నారు. రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

**మంత్రాలయం:**నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం, మాధవరం, రచ్చుమర్రి, మాలపల్లి, చిలకలడోన, సూదూరు, బూదూరు, కల్లుదేవకుంట, చెట్నహల్లి గ్రామాల్లో గణేష్ నిమజ్జనం ఉత్సాహంగా నిర్వహించారు. మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐలు శివాంజల్, విజయకుమార్ తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

**గోనెగండ్ల:** మండల కేంద్రమైన గోనెగండ్లతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తులు, యువకులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శుక్రవారం సాయంత్రం గోనెగండ్లలో వీరశైవమఠం పీఠాధిపతి శివయ్యస్వామి శాంతికపోతం పావురమును ఎగురవేసి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని వినాయక భక్త బృందం సభ్యులు నిమజ్జనం కోసం వినాయక విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. సీఐ విజయభాస్కర్, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

**పెద్దకడుబూరు :** మండల కేంద్రంతో పాటు దొడ్డిమేకల, మురవణి, చిన్నతుంబళం, కల్లుకుంట ఆయా గ్రామాల్లో ఉదయం నుంచి స్వామి వారికి పుష్పాభిషేకం, పంచామృతాభిషేకం వంటి పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం నిమజ్జనాన్ని పూర్తి చేశారు. ఎస్ఐ నిరంజన్ రెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు.

**నందవరం:**నందవరం మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక నిమజ్జనం శుక్రవారంతో వీదుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి తుంగభద్రనదిలో, వంకలు, జీఆర్‌పీ ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు. ఎస్ఐ కేశవ నిమజ్జన వేడుకలను పర్యవేక్షించారు.

**కౌతాళం:** కౌతాళంతో పాటు మండల పరిధిలోని ఎరిగేరి, హల్వి, కామవరం, ఉరుకుందతో పాటు వివిధ గ్రామాల్లో శుక్ర సాయంత్రం నిమజ్జన కార్యక్రమం ఘనంగా కొనసాగింది. కౌతాళంలో దాదాపు 50కి పైగా విగ్రహాలను ఉన్న ఎల్లెల్సీలో నిమజ్జనం చేశారు. కౌతాళం సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు చేపట్టారు.

**కోసిగి:** మూడు రోజులుగా భక్తులచే పూజలందుకుని వాడవాడలా వెలసిన గణనాథులు మూడు రోజులుగా పూజలందుకుని శుక్రవారం నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంతరెడ్డి బందోబస్తును నిర్వహించారు.


వెంకటగిరిలో కోలాట నృత్యం


కోసిగిలో..


మంత్రాలయంలో..


ఎమ్మిగనూరులో నృత్యం చేస్తున్న బాలికలు


ఎమ్మిగనూరు మూగతిపేటలో నిమజ్జనానికి వెళ్తున్న వినాయకుడు


యువకుల కోలాహలం


ఎమ్మిగనూరులో..

## తెలుగు భాష మధురమైనది


పల్లెపాడులో గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

**మంత్రాలయం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. అంత మధురాతిమధురమైన తెలుగుబాషను మనమందరం మాతృబాషలో మాట్లాడాలని మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ అన్నారు. శుక్రవారం మంత్రాలయం శ్రీవైష్ణవి ఉన్నత పాఠశాలలో తెలుగుబాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు ప్రిన్సిపల్ రాఘవేంద్ర, హెచ్ఎం అశ్విని ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రవి, శ్రీధర్, ఆది బసవేశ్వర, కార్తీక్, ధరణి, తదితరులు పాల్గొన్నారు.

**●ఎమ్మిగనూరు రూరల్:** ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి జవహార్ నవోదయ విద్యాలయంలో తెలుగు బాషా, క్రీడా దినోత్సవాన్ని విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన, సుమతీ శతకం వంటి పద్యాలు, కవితలు, వ్యాసరచన, వకృత్వ, నృత్య పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. అబ్దుల్ రెహమాన్, పద్మజానాన్సి, శిరీష, శశికిరణ్ పాల్గొన్నారు.

**కోసిగి:** ప్రతి తరగతిలో మాతృభాష మాధ్యమాన్ని కొనసాగించాలని.. తెలుగుబాష తీయదనం, తెలుగు బాష గొప్పదనం.. చేయెత్తి జైకొట్టు తెలుగోడా.. గతమెంతో ఘనకీర్తి కలవాడా తెలుగోడా.. దేశబాషలందు తెలుగులెస్స అన్న మాటలు అక్షర సత్యాలు అని.. టీడీపీ మండల అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి, పల్లెపాడు జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు దస్తగిరి బాషా పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో తెలుగు వ్యవహారిక బాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి, హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, ఆనంద్, శ్రీధర్‌బాబు, నాగేంద్ర ప్రసాద్, శాంతన్న, వెంకటేశ్, వరలక్ష్మి ఉన్నారు.

## 13 డీఎస్సీలు నిర్వహించిన ఘనత చంద్రబాబుదే

● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

**ఎమ్మిగనూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** పదమూడు డీఎస్సీల ద్వారా టీచర్ పోస్టులు నింపిన ఘనత చంద్రబాబుదేనని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఇంటి దగ్గర ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 14ఏళ్ల కాలంలో ప్రతి ఏడాది టీచర్ల పోస్టులు భర్తీ చేశారన్నారు. టీడీపీ ఇచ్చిన మాట ప్రకారం మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీని నిర్వహించి 16,347టీచర్ల పోస్టులను ఎలాంటి ఆటంకాలు లేకుండా నియమాకాలు జరిపిందన్నారు. వైసీపీ పాలనలో జగన్ మెగా డీఎస్సీ వేస్తానని చెప్పి నిరుద్యోగ టీచర్లను ఐదేళ్లపాటు మోసం చేశారని ప్రభుత్వం డీఎస్సీ ద్వార పోస్టులు భర్తిచేస్తుంటే జీర్ణించుకోలేని వైసీపీ డీఎస్సీని అడ్డుకునేందుకు 24 కేసులు వేసిందని ఆరోపించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లయ్య, నాయకులు కాశీం వలి, కేటీ వెంకటేశులు, తిరుపతయ్య నాయుడు, ముల్లా కరీముల్లా పాల్గొన్నారు.

**మంత్రాలయం:**ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన నిరుద్యోగులకుకూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ పారదర్శకంగా నిర్వహించి ఎంతోమంది జీవితాల్లో వెలుగు నింపిందని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి ఎన్ రాఘవేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం విడుదలచేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల ముఖ్యమంత్రి హోదాలో నారా చంద్రబాబునాయుడు 13 డీఎస్సీలు నిర్వహించి 1,80,208 పోస్టులు భర్తీచేసి చరిత్ర సృష్టించారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామిని 16,347 టీచర్‌పోస్టులు నిర్వహించిన ఘనత చంద్రబాబుకే చెందుతుందని తెలిపారు. మంచాల సింగిల్ విండో అధ్యక్షులు, టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి,మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, యువనాయకులు రాకేష్ రెడ్డి, రాజారెడ్డిలు పాల్గొన్నారు.

## సంపూర్ణ అక్ష్యరాస్యతకు 'ఉల్లాస్'

**గోనెగండ్ల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** జిల్లాలో సంపూర్ణ అక్ష్యరాస్యత సాధించేందుకు గాను ఉల్లాస్ 'అక్షరాంధ్ర' కార్యక్రమాన్ని ప్రభుత్వం వచ్చే నెల నుంచి ప్రారంబించినున్నదని వయోజన విద్య జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సంపంగి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం గోనెగండ్లలోని ఎంపీడీవో కార్యాలయం నందు మండలంలోని డ్వాక్రా గ్రూపు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో అనంతశయనా, ఏపీఎం హేమలత, అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ ప్రతాప్, జాకీర్‌హుస్సేన్, డీఆర్ డీఏ క్లస్టర్స్ కోఆర్డినేటర్స్, వీవోఏలు, వాలంటరీ టీచర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## అటవీ అధికారులకు జింక అప్పగింత

**నందవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):** హలహర్వి గ్రామంలో శుక్రవారం జింక దొరికినట్లు హెడ్ కానిస్టేబుల్ కొదండరామిరెడ్డి తెలిపారు. హలహర్వి గ్రామ శివారులో జింకపై కుక్కలు తరమి జింక తోడను కరిచాయి. కుక్కలు అరుస్తుండగా గమనించిన గ్రామస్థులు వెంటనే కుక్కలను తరిమి కొట్టి జింకను రక్షించారు. వెంటనే పోలీసులుకు తెలుపగా జింకకు ప్రథమ చికిత్స చేసి ఫారెస్టు అధికారులకు సమాచారం చేరవేశారు. వెంటనే అధికారుల వచ్చి జింకను అడవికి తరలించారు. జింకను కాపాడిన గ్రామస్థులకు పోలీసులు అభినందనలు తెలిపారు.

## భూములపై రైతులకే హక్కులు ఇవ్వాలి

**మంత్రాలయం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** ఎన్నో ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములను రైతులకు హక్కులుకల్పించి ఆన్‌లైన్‌లో తమపేర్లను నమోదుచేయాలని రైతులు తాహశీల్దారు రమాదేవికి మొరపెట్టుకున్నారు. శ్రీమఠం, సాగుచేసుకుంటున్న రైతుల తగాధ ఉన్న కారణంగా ఇరువర్గాలకు రెవెన్యూ అధికారులు ఇరువురికి నోటీసులు జారీచేశారు. దీంతో శుక్రవారం తాహసీల్దారు కార్యాలయంలో శ్రీమఠం భూములను సాగుచేసుకుంటున్న దాదాపు 30 మంది రైతులు తమవద్ద ఉన్న భూమికి సంబంధించిన రికార్డులతో వచ్చారు. ఇందులో రైతులు రాగన్న, వనికే నాగరాజు, గురురాజు, సున్నంరఘు, రామకృష్ణ, వీరేష్‌శెట్టి మరోకొంతమంది రైతులు తమ వద్ద ఉన్న రికార్డులను చూపించారు. 2009-14 వరకు తమపేర్లు ఆన్‌లైన్‌లో ఉన్నాయని ప్రభుత్వం ఇచ్చిన నష్ట పరిహారం పొందామని తెలిపారు. 2017లో తమపేర్ల మీద ఉన్న భూములను శ్రీమఠం పేరుమీదుగా ఆన్‌లైన్‌లో నమోదుచేశారని ఆరోపించారు. అదే భూములున్న కొంతమంది రైతులకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తమపేర్లు వస్తాయని ఆ తర్వాత మార్చారని తెలిపారు. సాగుచేసుకుంటున్న రైతులకే హక్కులు కల్పించి న్యాయం చేయాలని కోరారు. శ్రీమఠం రికార్డులు, రైతుల దగ్గర ఉన్నరికార్డులను పరిశీలించి జిల్లా ఉన్నత అధికారులకు నివేదిక పంపిస్తామని తహసీల్దారు రమాదేవి రైతులకు తెలిపారు.